ప్రజాశక్తి ఆదివారం అనుబంధం
జూలై 20, 2008

Entered
57353

అపర బ్రహ్మలు ఆళ్ళగడ్డ శిల్పులు

హ్యాపీ బర్త్‌డే

(2008 జులై 20నుంచి-
2008 జులై 26 వరకు)

జి.నివాస్
1సం॥, జులై-21
సుకన్య-రాంకిషోర్
అమెరికా

రమ్యశ్రీ
జులై-26
నీలిమ-అశోక్
కూకట్‌పల్లి-హైదరాబాద్

అజ్లాన్‌ఖాన్
జులై
కౌసర్-యూనిస్‌ఖాన్
బుర్హాన్‌పురం-ఖమ్మం

ఎం.బన్ని
1సం॥, జులై-2007
మాధవి-శ్రీను
బస్వాపూర్-నల్లగొండ

రమ్య
జులై
ఇందిర-మధు
రాణిగారితోట-విజయవాడ

సోనార్‌బాబు
2సం॥, జులై-2006
శైలజ-విజయభాస్కర్
చీరాల-ప్రకాశం

ఆర్. శ్రీహర్ష
జులై-25
ఉషారాణి-చినబాబు
గుంటూరు

వి.తనూజ్‌సాయి
జులై
భారతి-రామారావు
తాడేపల్లి-గుంటూరు

(ఆహ్వానం)

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా?! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు/పాప పేరు, పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు, తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు మీద కలర్ ఫోటో అంటించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను పదిహేను రోజుల ముందుగానే మాకు అందించాలని గుర్తుంచుకోండి.
మా చిరునామా: హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.



కన్నవారి కలలు సాకారం చేయాలి

మన అతిథి

పేరు	-	వై.ఆర్. హరగోపాల్ రెడ్డి
తల్లిదండ్రులు	-	సీతమ్మ, జయరామిరెడ్డి
జన్మస్థలం	-	నెల్లూరు జిల్లా, పెళ్ళకూరు మండలం, పాలచూరు గ్రామం
పుట్టిన తేదీ	-	15-06-1951
చదువు	-	ఎం.ఎల్, పిహెచ్‌డి
వృత్తి	-	నాగార్జున యూనివర్శిటీ వైస్ చాన్సలర్
హాబీలు	-	స్విమ్మింగ్, ఖాళీ సమయంలో పాత పాటలు వినడం
పరిశోధనలు	-	వెట్టి చాకిరి, సామాజిక న్యాయ పరిశోధన అంశాలపై పరిశోధన, 40 రకాలవ్యాసాలు రాయడం జరిగింది.
ప్రత్యేకము	-	అంతర్జాతీయ న్యాయ విషయాలపై, రాజ్యాంగపరమైన న్యాయ విషయాలపై లోతైన అవగాహన
అవార్డులు	-	2002లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఎపి ప్రభుత్వం నుంచి పొందారు.
ఇష్టపడేవి	-	పాతపాటలు
ఇష్టంలేనివి	-	ఇష్టము లేనివి ఏమీ లేవు
స్ఫూర్తి	-	పరిపాలనలో మాజీ వీసీలు వి.వేణుగోపాల రెడ్డి, వి.బాలమోహన్‌దాస్ బోధనలో ప్రొ॥ మహమ్మద్ గౌస్
నచ్చిన వ్యక్తులు	-	జస్టిస్ వి.ఆర్.క్రిష్ణయ్య, జస్టిస్ బి.ఎన్.భగవతి
నచ్చిన నాయకులు	-	సర్వేపల్లి రాధాకృష్ణ
నచ్చిన పుస్తకాలు	-	కాన్‌స్టిట్యూషనల్ లా
లక్ష్యం	-	అందరి సహకారంతో విశ్వవిద్యాలయాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకుని వెళ్లడం. విద్యార్థులకు ఉపాధి కల్పించే నూతన కోర్సులు, సిలబస్‌ను ఏర్పాటు చేయడం.

యువత వారి బాధ్యతలను తెలుసుకొని నైతిక విలువల్ని పెంపొందించుకోవాలి. జీవితంలో వారు సాధించాల్సిన గమ్యాన్ని ఎంచుకొని దాని సాధనకు కృషి చేయాలి. తద్వారా తల్లిదండ్రుల కలల్ని సాకారం చేసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఉన్నత విద్యా రంగంలో వస్తున్న విదేశీ ధోరణుల వలన మన వారిలో కూడా పోటీతత్వం పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా విద్యావ్యవస్థ పటిష్టపడే అవకాశం ఉంది.

ఈ సంచికలో....

టపా	...	2
ఆరోగ్యం	...	3
సీరియల్	...	8
సినిమా	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14

ఇంకా...



చూద్దామా ... 4

సందర్శనీయ స్థలం 'సికింద్రా'

మంచిపుస్తకం ...6

అమెరికా వ్యూహంలో జూనియర్ భాగస్వామ్యం!

లాహిరి... లాహిరి	...	20
మనసా... తెలుసా	...	22
విజ్ఞాన వీచిక	...	23
రుచి	...	24

కథ 18

జానకి చావు



ఎంతో ప్రయోజనకరం

ఈ నెల 6న స్నేహ సంచికలో అట్టమీది కథ "అందం కోసం ఆరాటం" ఆసక్తిదాయకంగా ఉంది. రకరకాల ఆకృతులలో మొక్కల్ని మలిచిన కళాఖండాలను రూపొందించిన వారికి మనస్ఫూర్తిగా అభినందనలు తెల్పుతున్నాను. 'ఆరోగ్యం' శీర్షిక ప్రతివారం విషయ అవగాహన కల్గిస్తూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటోంది. 'సినిమా కబుర్లు' ద్వారా రావు రమేష్, రావుగోపాలరావు గారి అబ్బాయి అని తెలుసుకుని ఆశ్చర్యానందాన్ని పొందాం. ఆ మహా'నటవిరాట్' పుత్రుడు రావురమేష్ అని తెలిసి మున్ముందు వీరి సినిమాలు చూడాలని నిర్ణయించుకున్నాం. రావు గోపాలరావు గారిని ఏ కోణంలోనూ అనుకరించకుండా నటిస్తున్న రావు రమేష్ మున్ముందు మరింత ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకోవాలని ఆకాంక్షిస్తున్నాం. పేదలకు న్యాయం చేయాలన్న మహోన్నత ఆశయాన్ని వెలిబుచ్చిన మన అతిథి పి.ఎ. చౌదరి గారి ఉదాత్త మనసుకు మా నమస్సులు. ఓ మంచి పుస్తకం 'కొమ్మా కొమ్మా కోకిలమ్మా' సినీ సంగీతాభి మానులను అలరిస్తుందనిపించింది.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం టౌన్.

విశ్లేషణ బాగుంది

స్నేహలో మన అతిథిగా ప్రత్తిపాటి అంకమ్మ చౌదరి గారి మాటలు నేటిసమాజంలో కన్పిస్తున్నవే. ప్రతివ్యక్తి డబ్బుకి, ధనానికి ప్రాధాన్యత చూపుతున్నారు. దానినే ధ్యేయంగా పెట్టుకుంటున్నాడు కానీ, పేదలకు న్యాయం చేయాలి. న్యాయం చేసే విధంగా వృత్తి ధర్మాన్ని పాటించాలి... అన్న ప్రత్తిపాటి గారి విశ్లేషణ బాగుంది. ఆయన జీవితంలో మరచిపోలేని సంఘటనలు, అనుభవాలు బాగున్నాయి. ఓ మంచి పుస్తకం శీర్షికలో "గాన కోకిలల గాథాలహరి" గురించి చదివి సంతోషించాం. రచయిత్రి ఇంద్రగంటి జానకీబాల సమకూర్చిన 'కొమ్మా కొమ్మా కోకిలమ్మా' పుస్తకం గాయనీమణుల గాథల సమాహారమే ఈ పుస్తకం. వారి జీవితాలలోని చేదునూ, తీపిని నిజంగా మా కళ్ళకు కట్టినట్లుగా ఉంది. హైకోర్టు న్యాయవాది జి.ఎల్. నరసింహారావు గారు ఇస్తున్న సలహాలు ఖచ్చితంగా న్యాయం చేకూర్చుతాయని నేననుకుంటున్నాను. వారు ఇస్తున్న సలహాలు చాలా బాగున్నాయి. బాలస్నేహలో చిన్నపిల్లల కోసం మీరు ప్రచురిస్తున్న దారి కనుక్కోండి ప్రతివారం సూపర్. అలాగే తేడాలు చెప్పుకోండోచ్, చుక్కల్లో చిన్నది ఇంకా అడిస్తా శీర్షికలు పిల్లలను కూడా చిన్నప్పటి నుండే అక్షరాల పట్ల ఆసక్తి కలిగించేలా ఉన్నాయి. పిల్లల కోసం ప్రతి వారం అందిస్తున్న కథలు చాలా బాగున్నాయి. 'ఆహార నాళంలో ఆరోగ్య సమస్యలు' ఈ వారం ఆరోగ్యంలో మా కోసం ప్రత్యేకంగా ఉంది. అనారోగ్యం వచ్చినప్పుడు ఎవరూ స్వయంగా ప్రథమ చికిత్స చేసుకోలేరు. అని దాని ముందు వెనుక జరిగే పరిణామాలను మా కళ్లకు కట్టినట్లు వర్ణించారు.

కర్రా వరప్రసాద్,
యలమర్రు, కంద్రిక.

సమాజానికి ఒక హెచ్చరిక

"తప్పెవరిది?" కథలో ఎయిడ్స్ గురించి తెలిపారు. ఇది సమాజానికి హెచ్చరిక వంటిది. మానవునికి అనేక కోర్కెలుంటాయి. అన్నీ తీరవు. అందుకే మనిషి కోర్కెల్ని అదుపు చేసుకోవాలి. క్షణికమైన సుఖం కోసం భార్యాబిడ్డల ఆరోగ్యాన్ని బలి చేయడం మంచిది కాదు. తప్పెవరిది? కథ యువతరానికి హెచ్చరిక వంటిది. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తి అక్షరాలా నిజం. డా॥ నాగినేని భాస్కర రావు గారు ఎయిడ్స్ వ్యాధి గురించి కథ రూపంలో సమాజానికి ఒక హెచ్చరిక చేశారు. వారికి నా అభినందనలు.

నరసింహరాజు,రామకిష్టాపురం.

నిజంగా మంచి పుస్తకం

భానుమతి, సురభి కమలాబాయి, ఎస్. వరలక్ష్మి, జి. వరలక్ష్మి, భానుమతి, సుశీల మొదలగు గొప్పనటీమణులను, గాయనీమణులను పరిచయం చేశారు. గాన కోకిలల గాథాలహరి పుస్తక పరిచయం బాగుంది. రావుగోపాలరావుగారి గురించి వారి కుమారుడు రమేష్ సినిమా కబుర్లు బాగున్నాయి. హ్యాపీ బర్త్‌డే, కలం స్నేహం ద్వారా పిల్లలు ఆనందపడుతున్నారు. ఆరోగ్యం శీర్షికలో ఆహార నాళంలో ఆరోగ్య సమస్యలు వ్యాసం అందరికీ విజ్ఞానదాయకంగా ఉంది.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

రుచి అద్భుతం

తల్లివంటి పల్లెను వదలరాదు. గ్వాలియర్ అద్భుత శిలాదృశ్యాలు, విష్ణు మందిరం, మాన్ మందిర్, జైవిలాస్ మ్యూజియం, ఝాన్సీ విగ్రహం అద్భుతం. రావు గోపాలరావు గారి కబుర్లు బాగున్నాయి. గులాబ్‌జామ్ అద్భుతంగా ఉంది. వృత్తి ధర్మం ఉచితంగా ఉండాలన్న చౌదరిగారి అతిథి మాట బాగుంది. ఇంద్రగంటి 'కోకిలల' పుస్తక పరిచయం తీరు చాలా బావుంది. సమాజాన్ని ఎయిడ్స్ బారి నుండి విముక్తి చేయమనడం నాగినేనికే చెల్లింది.

–వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

ఎందరికో గుణపాఠం

ఆనందమే జీవిత మకరందం అన్నాడు ఓ సినిమా మధురభావాల కవి. 60లో 20లా కనిపించాలని నిత్యం తలకు రంగు వేసే వాళ్లు మీసాలకు సంపెగ నూనెలు రాసేవారు కోకొల్లలు. శారీరక ఆకృతి అంద చందాలను బట్టి ఎందరికో గుర్తింపు గౌరవ మర్యాదలు కలుగుతూ వుంటాయి. చక్కనమ్మ చిక్కినా అందమే అన్న



సామెత వేయి నోళ్ళ నానుతూనే ఉంది. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ, యక్ష కిన్నెర కింపురుష దేవతలు... మొదలగు వారు అద్భుత అందాలకు ప్రతీకలకు గానే వర్ణింపబడ్డారు. అందం సహజంగా ఏర్పడితేనే ఆనందం. కాని ప్రకృతి విరుద్ధమైన కృత్యాల ద్వారా శారీరక ఆకృతులను, అంగ ఆకృతులను మార్పు చేసుకోవడం వల్ల ఒక్కొక్క పర్యాయం వెగటుకాక తప్పదన్న కాకర్లమూడి విజయ్ గారి విశ్లేషణ వ్యాసం ఎందరికో, గుణపాఠం కాకతప్పదు! ఈరోజులలో అందం కోసం పచ్చబొట్లు పొడిపించుకోవడం మహా వెర్రిగా తయారయింది. ముఖ్యంగా సినిమా తారలు, కొందరు ప్రముఖులు పచ్చబొట్లు మోజుల్లో మునిగి తేలుతున్నారు. కీ.శే రావుగోపాలరావు గారి అబ్బాయి రమేష్ చెప్పిన సినిమా కబుర్లు చదివాం. నటనలో, వ్యక్తిత్వంలోని విశేషాలు మా రంగ సల్థ కళాకారులకు గొప్ప స్పందన కల్గించింది.

జె.సుధాకర్ పట్నాయక్,
కాకినాడ, తూ.గో. జిల్లా



వీరి వీరి గుమ్మడి పండు
వీరి పేరేమి?

ఈ ఫొటో ఓ బాలీవుడ్ హీరోది. జవాబు తెలియాలంటే 21వ పేజీ చూడండి.

ఆరోగ్యం

నాలుగు విధాల మేలు చేసే నడక

డాక్టర్ సిఎల్ వెంకటరావు,
హైదరాబాద్. 9848055806

ఈ రోజుల్లో మనం నడవకుండా ఈ మూల నుంచి ఆ మూలకు ఆ మూల నుంచి ఈ మూలకు వెళ్లడానికి అనేక సాధనాలున్నాయి. స్కూటర్లు, బస్సులు, బైకులు, రైళ్లు, ఎలివేటర్లు (లిఫ్టులు), విమానాలు వగైరాలు. ఇన్ని సౌకర్యాలున్న ఆధునిక కాలంలో మనం నడకకు పూర్తిగా దూరమైపోతున్నామంటే అతిశయోక్తి కాదు. శాస్త్రీయంగా జరిగిన అనేక ప్రయోగాల తర్వాత నడక వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని వెల్లడైంది.

క్రమం తప్పకుండా నడవటం వల్ల గుండె సమర్థవంతంగా రక్తాన్ని పంప్ చేయగలుగుతుంది. శరీరమంతటికీ జరిగే రక్త ప్రసరణను మెరుగుపరిచి మనిషిని చురుకుగా వుండేట్లు చేస్తుంది. అంతేకాకుండా రక్తంలో ఉండే, గుండె జబ్బుల్ని కొనితెచ్చే కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరాయిడ్స్ శాతాన్ని తగ్గిస్తుంది. గుండె జబ్బుల్ని కాపాడే హై డెన్సిటీ ఫ్యాట్‌ను పెంచుతుంది కూడా. మరో మాటలో చెప్పాలంటే గుండె జబ్బుల్ని కాపాడటానికి నడక దివ్యౌషధంగా పనిచేస్తుంది.

రక్తపోటు

అధిక రక్తపోటు బాధితులు నడకను ఒక వ్యాయామంగా చేసుకుంటే అనేక లాభాలు కలుగుతాయి. మొదటి ప్రయోజనం.. బరువు తగ్గడం. బరువు తగ్గితే రక్తపోటు నియంత్రణలోకి వస్తుంది. నడక మన శరీరంలో ముడుచుకున్న రక్తనాళాల్ని తెరుచుకునేటట్లు చేసి, వాటి మీద ఒత్తిడి తగ్గిస్తుంది. రక్తనాళాల్ని బండపరిచే కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరాయిడ్స్ శాతాన్ని రక్తంలో తగ్గిస్తుంది. ఉదయం నడక వల్ల నరాల వ్యవస్థ రిలాక్స్ అవుతుంది. దీంతో ఒత్తిడి సంబంధిత హార్మోనుల ఉత్పత్తి తగ్గి ఆ రోజంతా హాయిగా ఉంటారు.

మధుమేహం

మధుమేహ రోగులకు నడక వరం లాంటిది. నడక మన శరీరంలోని గ్లూకోజ్‌ను సమర్థవంతంగా వినియోగించుకునేటట్లు చేసి రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. మధుమేహ వ్యాధి బాధితుల్లో తక్కువగా వుండే ఇన్సులిన్ ఉత్పత్తిని నడక ప్రేరేపిస్తుంది. రెగ్యులర్‌గా నడవడం ద్వారా వీరు యాంటిబయాటిక్ మందుల్ని, ఇన్సులిన్ దోసులను తగ్గించుకోవచ్చు.

మలబద్ధకం

నడక మన పేగుల పనిని మెరుగుపరిచి మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. ముఖ్యంగా వాహనాల్లో ప్రయాణిస్తూ, ఎంత సేపూ ఆఫీసుల్లో కూర్చొని పనిచేసుకునే వారికి మలబద్ధకాన్నుంచి తప్పించుకోవడానికి నడక మంచి ఉపకరణం.

బరువు

స్థూలకాయులు శరీర బరువును, కొవ్వును తగ్గించుకోవడానికి డైటింగ్ చేస్తుంటారు. ఇది తాత్కాలికమే. దీంతోపాటు ఏదో ఒక వ్యాయామం చేయాలి. అలాంటి వాళ్లు నడకను అలవాటు చేసుకుంటే సౌకర్యంగా వుంటుంది.

పొట్ట

జారిపోతున్న పొట్ట కండరాలను బిగుతుగాచేసి ఆ భాగంలోని కొవ్వును కరిగిస్తుంది నడక. అందుకే క్రమం తప్పకుండా నడిచేవాళ్లు బరువు తగ్గకపోయినా స్లిమ్‌గా కనిపిస్తారు.

మెదడు

నడుస్తున్నప్పుడు మెదడుకు రక్తం పుష్కలంగా సరఫరా కావడంతో వల్ల చురుకుగా ఆలోచించగలుగుతాం. అంతే కాక జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది కూడా. నడుస్తున్నప్పుడు మన ఆలోచనలు చురుకుగా సాగడానికి కారణం ఇదే.

ఎముకలు

నడక వల్ల ఎముకల్లో కాల్షియం పెరిగి ఎముకలు గట్టిపడతాయి. ముఖ్యంగా 50 ఏళ్ల దాటిన వాళ్లు రోజుకు గ్లాసుడు పాలు తాగుతూ, నడకను అలవాటు చేసుకుంటే ఎముకలు పెలుసుబారవు. ఫ్రాక్చర్ కావు. కండరాలు, కీళ్లు బిగుసుకుపోయేవారు నడక వల్ల అద్భుతమైన ఉపశమనం పొందుతారు. నడక వారి కీళ్లలో కదలికల్ని పెంచి కీళ్ల నొప్పుల నుంచి దూరం చేస్తుంది.

మూడ్

కొద్దిసేపు చురుకుగా నడవడం వల్ల మనిషి మూడ్ మారుతుందనీ, మనసు ఉత్తేజకరంగా తయారవుతుందనీ ప్రయోగాత్మక పరిశీలనలో రుజువైంది. కాలిఫోర్నియా స్టేట్ యూనివర్శిటీకి చెందిన రాబర్ట్ ఇ థయర్ అనే సైకాలజీ ప్రొఫెసర్ జరిపిన పరిశీలనలో 20 నిమిషాలపాటు నడిచిన తర్వాత ఆ వ్యక్తులలో అంతకు మునుపున్న టెన్షన్ తగ్గింది. ఆ తర్వాత రెండు గంటల దాకా వాళ్లెంతో ఉల్లాసంగా కనిపించారు. జేమ్స్ రిపే అనే కార్డియాలజిస్ట్ జరిపిన పరిశీలనలో మూడు మైళ్ల నడక తర్వాత ఆ వ్యక్తుల్లో యాంగ్సయిటీ ఆందోళనలే కాకుండా బీపీ కూడా తగ్గినట్లు రుజువైంది.

క్రమశిక్షణ

క్రమం తప్పకుండా నడిచే అలవాటు జీవితంలో క్రమశిక్షణను కలిగిస్తుంది. నడక శరీర భంగిమను మెరుగుపరచడమే కాక కండరాలను చురుగ్గా వుంచి మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. పొగ తాగే అలవాటును మానదల్చుకునే వారు రెగ్యులర్‌గా నడవడం ద్వారా అందుకు అవసరమైన మనోస్థైర్యాన్ని పొంది 3 నుంచి నాలుగునెలల్లో ఆ అలవాటును మానుకోగలుగుతారు.

❋

యాజీవ్



'సికంద్రా' ఆగ్రాకు 5 కిలోమీటర్ల దూరంలో ఢిల్లీ రోడ్డు మీద ఉంది. 'సికిందర్ లోడి' తన రాజధానిని ఢిల్లీ నుంచి ఆగ్రాకు సమీపంగా మార్చుకోవాలని 1504లో ఈ పట్టణ నిర్మాణానికి పూనుకున్నాడు. లోడీలను మొఘలులు జయించిన తరువాత బాబరు కాలంలో ఈ పట్టణాన్ని విడిచి యమునా నదికి అవతలి ఒడ్డున ఉన్న ఇత్మతుద్దౌలా ప్రాంతానికి రాజధాని మారింది. తరువాతి కాలంలో ఆగ్రాకు, అక్కడి నుంచి ఢిల్లీకి మారింది. ఆంగ్లేయుల కాలంలో కలకత్తా రాజ్యపీఠంగా కొన్నాళ్లు సాగినా మళ్లీ ఢిల్లీకి మారింది.

సందర్శనీయ స్థలం 'సికింద్రా'

అక్బరు పాదుషా సమాధి ఇక్కడ నిర్మించటమే సికంద్రా ప్రత్యేకత. జీవించి ఉండగానే తమ సమాధుల కట్టడాలను నిర్మించుకునే ఆచారం వారిలో ఉండేదికదా! ఈ కట్టడం అక్బరు కాలంలో మొదలవగా అతని కుమారుడు జహంగీరు కాలంలో (1613) పూర్తి చేశాడు. అక్బర్ హిందూ ముస్లింలను సమాన దృష్టితో చూసినట్టుగానే, ఆయన సమాధికూడా హిందూ, ముస్లిం సమ్మేళనానికీ, సమైక్యతకూ చిహ్నంగా నిలచింది. 150 ఎకరాల విస్తీర్ణంలో కట్టిన ఈ కట్టడం చుట్టూ 24 అడుగుల ఎత్తున్న చతురస్రాకారపు ప్రాకారంలో 1.5 మైళ్ల పొడవున ఉంది. ఇది నలువైపులా నాలుగు పెద్ద పెద్ద గుమ్మాలతో, నాలుగు మూలలా అష్టభుజాకారపు బురుజులతో పెద్ద కోటలాగుంటుంది. కానీ నాలుగు తలుపులలో మూడింటిని మూసివేశారు. ఇప్పుడు దక్షిణ ద్వారం ఒక్కటి మాత్రమే ప్రవేశ ద్వారంగా ఉంది. ఒక్కొక్క ద్వారం 80 అడుగులు ఎత్తుంది. నాలుగువైపులా పాలరాతి మినార్లతో తాజ్‌మహల్లా అనిపిస్తుంది. ఆర్చిఆకారంలో ఉన్న వీటి తలుపులు రెండంతస్థులతో తాజ్ ప్రాకార ద్వారాన్ని పోలి ఉంటాయి. ఈ ద్వారాలు ఎర్రరాతితో నిర్మించి, దానిమీద తెల్లని పాలరాతితో చెక్కిన నగిషీలు, పూ లతలతో చూడ చక్కగా, మనోహరంగా వుంటాయి. ఈ గుమ్మాల నుండి సమాధి వరకు వెళ్లే దారి ఆరు అడుగుల ఎత్తున 75 అడుగుల వెడల్పున ఉంటుంది. దారి మధ్యలో పరిచిన వివిధ రంగుల పాలరాతి పలకలపై నడుస్తుంటే ఏదో అందమైన తివాచీ మీద నడుస్తున్నట్లుంటుంది. ఇక్కడి పాలరాతి గుమ్మటాలు, వాటర్ ఫౌంటెన్‌లు దీనికి మరింత అందాన్నిచ్చాయి.

లోపల వుండే సమాధి 340 చదరపు అడుగులతో ఐదు అంతస్థులుగా నిర్మించిన పాలరాతి కట్టడం. మొదటి అంతస్తు 30 అడుగుల ఎత్తున, 320 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. దీనికి కూడా ఆర్చిల రూపంలో నాలుగువైపులా మహాద్వారాలు వున్నాయి. ఒక్కో ద్వారానికిరువైపులా ఐదు చిన్న ఆర్చిలతో మొత్తం11 ఆర్చిల వరుస ఒక అద్భుత దృశ్యంగా ఉంటుంది. ఈ ఆర్చిలు వెలుపలున్న ప్రాకారపు ద్వారానికి సమాంతరంగా ఉంటాయి. దక్షిణ ద్వారం నుంచి క్రిందికి మెట్లు దిగి వెళితే అక్కడ అక్బర్ సమాధి ఏ అలంకరణలూ లేకుండా నిరాడంబరంగా ఉంటుంది. మొఘల్ సామ్రాజ్యం ఉన్నపుడు అక్బర్‌కు చెందిన వస్తువులు, ఆయుధాలు ఇక్కడుంచేవారు. తరువాత కాలంలో దాడులలో అవి కనిపించలేదు. ఇప్పుడవి ఎక్కడున్నాయో కూడా తెలీదు.

అక్బర్ అంతిమ విశ్రాంతిని చూస్తుంటే కొన్ని విషయాలు మనస్సులో మెదులుతాయి. అక్బర్ ఇస్లాంను మాత్రమే సత్యమని, ఇతర మతాలను ద్వేషించలేదు. అన్ని మతాలలోని మూల ప్రాతిపదిక ఒక్కటేనని గ్రహించగలిగిన ధీశాలి. సర్వమత సామరస్యాన్ని సాధించేందుకు ప్రయత్నించిన ప్రగతి శీలి. ఈ సమాధిలో కూడా ఆయన అభీష్టం మేరకు, ఉషోదయదిశగా ఉండేటట్లు చేశారు. ఇది దిన్ ఇలాహి ప్రాతిపదిక (ముస్లింలు తల మక్కా దిశగా తిరిగి వుండేట్లుగా సమాధి చేస్తారు). సాయంత్రపువేళ ముందు గేటు దగ్గర నుంచి చూస్తే, ఈ సమాధి మీద ధృవ నక్షత్రం ప్రకాశిస్తూ





కనిపిస్తుంది. ఈ అమెరికలో కూడా తాజ్‌మహల్‌ను అనుకరించారు.

దీనికి పక్కనున్న గదులలో అగ్బర్ కుమార్తెలు అరన్‌భానో, షకూర్ ఉన్నీసా, రజియా సుల్తానా తరువాతి తరాలకు చెందిన సులేమాన్ షికో లాంటి వారి సమాధులున్నాయి. పైనున్న 2, 3,4 అంతస్తులు, కిందనున్న ఆర్చీలతో సమంగా అమర్చి ఒక అందాల సమాహారంగా తీర్చిదిద్దారు. ఐదవ అంతస్థు మాత్రం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. 157 చదరపు అడుగుల విస్తీర్ణంతో చుట్టూ ఏర్పరచిన పాలరాతి జాలీలే గోడలు. ఒక్కొక్క జాలీ ఒక్కో శిల్ప రీతిలో మంచి అందాల వైవిధ్యాన్ని ఆవిష్కరించిన రమణీయ దృశ్యం. ఈ అంతుస్థుకు పైన ఆచ్ఛాదన ఏమీలేదు. ఆర్చీల మీద అగ్బర్ రాజ్యపాలనా విశిష్టతను వర్ణిస్తూ పర్షియన్ కవితలు చెక్కారు. ఇక్కడ కిందనున్న సమాధికి నమూనా ఉంది. ఇది అసలు సమాధికి సరిగా సరళరేఖలో ఉంటుంది. దీనిపై చుట్టూ మలిచిన పుష్పలతాదులు మనోహరంగా ఉన్నాయి. దీనికి తలవైపున "అల్లాహో అగ్బర్" (భగవంతుడే సర్వానికీ అధిపతి) అనీ రెండవపక్క "జిల్లా జలాలహు" (ఆయన కీర్తి అమోఘమైనది) అని మలిచారు. మిగిలిన రెండు వైపులా భగవంతుని 99 నామాలు చెక్కారు. ఇవన్నీ పర్షియన్‌లో ఉన్నాయి. పూర్వం పర్వదినాలలో వెండి, బంగారపు జరీలతోనున్న పట్టు వస్త్రానికి నవరత్నాలు అమర్చి ఈ సమాధిపైన కప్పేవారట.

ఈ దేశంలో ప్రభవించిన మహామహులలో ఒకరైన అగ్బర్ చక్రవర్తి ఇక్కడ అంతిమ విశ్రాంతి తీసుకున్నారు. మనసా, వాచా, కర్మణా భారత మాత తనయునిగా జీవించాడు. మత సంస్కృతుల కారణంగా, రాజ్యాధిపత్య కారణంగా, రాజపుత్రులతో తరచూ సంభవిస్తున్న యుద్ధకాండకు సమాప్తి చెప్పినది ఇతడే. రాజపుత్రులతో వియ్యమందాడు. రాజపుత్ర స్త్రీలు తన అంతఃపురంలో వారి మతానుసారం జీవించటానికి పరిపూర్ణ స్వేచ్ఛ కల్పించాడు. రాజపుత్రులను ఎంతో ఉన్నత పదవులలో నియమించి వారి విశ్వాసాన్ని పరిపూర్ణంగా చూరగొని సమర్థులైన వారి సలహాలతో తన శక్తియుక్తులతో సర్వజనామోదంగా తన పరిపాలన సాగించారు. విశాలదృక్పథంతో అన్ని దేశాల, అన్ని మతాల పండితులనూ, కళాకారులనూ గౌరవించాడు. ఆగ్రాలో క్రైస్తవమతం (జెస్యూట్లు) తమ బోధలు చేసుకోవటానికి, చర్చి నిర్మించుకోటానికి వారి ననుమతించి స్థలమిచ్చి ఆదరించిన ఉదారుడు. మతానికి రాజ్యపాలనకూ సంబంధంలేదని 500 సంవత్సరాలనాడే ఆచరించి చూపిన మానవతావాది. అంతటి







విశాల హృదయుని సమాధికి చివరి అంతస్థుకుండే ఆచ్ఛాదన అనంతాకాశమే. ప్రపంచంలోని అన్ని దిక్కులనుండీ గాలి, వెలుతురు, విభిన్న భావజలమూ అతని సమాధిని స్పృశిస్తుంటాయి. ❋

కాపీ

సోము: అరేయ్ నాకు ఒక్క ప్రశ్న కూడా అర్థం కాలేదురా. అందుకే ఖాళీ పేపర్ ఇచ్చి వచ్చా.

రాము: ఓ షిట్! నువ్వుకూడా అదే చేశావా? మనిద్దరం కాపీ కొట్టామని మన టీచర్‌కు తెలిసిపోతుంది కదరా !!



అమెరికాతో అణు ఒప్పందానికి వ్యతిరేకంగా వామపక్షాలు యుపిఎ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నాయి. అణు ఒప్పందం సారాంశం(టెక్స్ట్) బట్టే మాత్రమే కాక అది కుదుర్చుకుంటున్న సందర్భం(కాంటెక్స్ట్)ను బట్టే కూడా తాము వ్యతిరేకిస్తున్నామని వామపక్షాలు స్పష్టం చేశాయి. అయినా కాంగ్రెస్ నేతలు, వ్యాఖ్యాతలు వామపక్షాలు గుడ్డి అమెరికా వ్యతిరేకతతో వ్యవహరిస్తున్నాయని ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇంకా కొందరు సాంకేతికంగా ఏవో వాదనలు చేస్తూ ఈ ఒప్పందం దేశానికి చాలా ప్రయోజనకరమని భ్రమలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ రాజకీయ పరిస్థితినుంచి ప్రయోజనం పొందాలనుకుంటున్న బిజెపి వంటి పార్టీలు అమెరికాతో వ్యూహాత్మక మైత్రికి తాము వ్యతిరేకం కాదనే విషయాన్ని నొక్కి చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో అణు ఒప్పందం చర్చ పూర్వాపరాలు అర్థం చేసుకోవడం సంక్లిష్టంగా తయారవుతున్నది. దానికి తోడు మీడియాలో కూడా ప్రభుత్వం మనుగడ గురించిన విషయాలపై వున్న కేంద్రీకరణ అణు ఒప్పందంపై వుండటం లేదు. దాని స్వభావమే ఇందుకు కారణమవుతున్నది. ఇలాంటి పరిస్థితులలో అమెరికాతో ఇటీవలి కాలంలో భారత దేశం బ్రహ్మముడి బిగేసిన తీరుము దీని పర్యవసానాలను ఒక చారిత్రిక క్రమంలో పరిశీలిస్తూ ప్రకాశ్ కరత్ రాసిన ఇంగ్లీషు వ్యాసాల సంకలనం 'సబార్డినేట్ అలీ'(విధేయ నేస్తం). దాని తెలుగు అనువాదం 'జూనియర్ భాగస్వామి'. అమెరికాతో సంబంధాలు, అణు ఒప్పందంపై చర్చ తారాస్థాయికి చేరిన నేటి నేపథ్యంలో ఈ పుస్తకం అమూల్యమైన సమాచారం అందిస్తుంది.



అమెరికా వ్యూహంలో జూనియర్ భాగస్వామ్యం!

చరిత్రలో ఏ పరిణామమూ దానికదే జరగదు. వివిధ పరిణామాల మధ్య గల సంబంధాన్ని, కొనసాగింపును చూస్తే తప్ప నడుస్తున్న చరిత్ర కూడా అర్థం కాదు. కాని ఇరవై నాలుగ్గంటల ఛానళ్ల యుగంలో అనుక్షణ ప్రసారాలలో కూడా వాటిని ఆ విధంగా చూపించక పోగా ఏదో హడావుడితో కాలం నెట్టేయడమే జరుగుతుంటుంది. అందుకు భిన్నంగా ప్రకాశ్ కరత్ రాసిన ఈ వ్యాస సంకలనం పదేళ్ల వ్యవధిలో భారతదేశాన్ని పాలకులు అమెరికా వుచ్చులో చిక్కించిన తీరును కళ్లకు కడుతుంది. 2000-2007 మధ్య కాలంలో ఇందుకు సంబంధించిన పరిణామాలపై ప్రకాశ్ కరత్ అ సమయంలోనే చేసిన వ్యాఖ్యానాలు, విశ్లేషణలు ఇందులో చూడగలము. అయితే ముందునుంచి వెనక్కు వెళ్లే పద్ధతిలో ఈ వ్యాసాల ప్రచురణ జరగడం వల్ల వర్తమానం నుంచి గతంలోకి పయనించిన భావన కలుగుతుంది.

'ఇండో అమెరికా వ్యూహాత్మక పొత్తు ఫలితాలు' అన్న మొదటి వ్యాసం చాలా కీలకమైంది, సమగ్రమైంది. 1999 నుంచి 2007 వరకూ వచ్చిన మార్పుల వెనక తర్కాన్ని ఇది చక్కగా విశ్లేషిస్తుంది. అమెరికా పాలకులు భారత దేశాన్ని ఉచ్చులోకి లాగిన తీరును చెబుతుంది. సోవియట్ యూనియన్ ఉనికిలో వుండగా దానికి వ్యతిరేకంగా పాకిస్తాన్‌ను ప్రధాన వేదికగా అమెరికా ఉపయోగించుకుంది. 1991లో సోవియట్ విచ్ఛిన్నం తర్వాత దక్షిణాసియాలో భారత దేశాన్ని తన వ్యూహంలోకి లాగడం మొదలెట్టింది. పివి నరసింహారావు హయాంలో భద్రతా సహకారానికి సంబంధించి కుదిరిన మొదటి ఒప్పందం ఇందుకు ఆరంభవాచకమైంది. బిజెపి ప్రభుత్వం ఈ క్రమాన్ని మరింత వూపుగా కొనసాగించింది. 1998 మే11-13 మధ్య వాజ్‌పేయి ప్రభుత్వం పో ఖ్రాన్‌లో అణు విస్ఫోటనం నిర్వహించడంతో కొంతకాలం సైనిక సహకారాన్ని నిలిపేసినట్టు నటించినా అది ఎంతో కాలం అమలు కాలేదు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సహకారం కోసం అప్పటి అమెరికా ప్రతినిధి స్ట్రాబ్ టాల్బోట్, విదేశాంగమంత్రి జస్వంత్ సింగ్‌లు అదే పనిగా సమావేశమవుతూ వచ్చారు.

1999-2004 మధ్య కాలంలోనే ఇరు దేశాల పొత్తు రూపు రేఖలు ఖరారవుతూ వచ్చాయి. 2000 మార్చిలో బిల్ క్లింటన్ భారత దేశ పర్యటన సందర్భంలో దాన్ని ఒక ప్రాంతీయ శక్తిగా గుర్తించడానికి సంసిద్ధమేనని సూచించారు. పాకిస్తాన్ స్థానే మనదేశం అమెరికాకు సహజ నేస్తం కావడానికి సర్వం సిద్ధమైందని వాజ్‌పేయి సంబరపడిపోయారు. 2001 సెప్టెంబరు 11 ఘటనల తర్వాత వాజ్‌పేయి బుష్ కు లేఖ రాస్తూ టెర్రరిజంపై యుద్ధంలో మేము మీతో వుంటామని ప్రకటించారు. కాని అమెరికా ఇండియాను గాక పాకిస్తాన్‌నే వేదికగా చేసుకుని ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణ జరిపింది. 2002లో బుష్ ప్రభుత్వం జాతీయ భద్రతా వ్యూహం కూడా భారత దేశాన్ని తన వైపు తిప్పుకోవడంపై కేంద్రీకరించింది. 40 మంది అమెరికా సైనిక దౌత్యాధికారులు ఇందుకోసం అధ్యయనంలో తలమునకలైనారు. చైనాను నిలవరించే స్నేహితుడిగా 2020కల్లా భారత దేశాన్ని తయారు చేసుకోవాలని ఆ విధాన పత్రంలో నిర్దేశించుకున్నారు!

2004లో వాజ్‌పేయి స్థానే మన్మోహన్ ప్రధాని అయినప్పటికీ ఈ ధోరణి మారలేదు. వామపక్షాల వొత్తిడి కారణంగా సిఎంపిలో స్వతంత్ర విదేశాంగ విధానం అని పేర్కొన్నా రాష్ట్రపతి తొలి ప్రసంగంలోనే అమెరికాతో సాన్నిహిత్యం నొక్కి చెప్పబడింది. 2005 జనవరిలో బుష్ రెండవ దఫా పాలన ఆరంభం కావడంతోనే విదేశాంగ శాఖ స్వీకరించిన కండోలిజా రైజ్ 21వ శతాబ్దంలో భారత్ ఒక ప్రధాన ప్రపంచ శక్తిగా ఎదగగలదని ఉబ్బేశారు. అదే ఏడాది మొదట్లో విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ

ఆ తర్వాత ప్రధాని మన్మోహన్ సింగ్‌లు అమెరికాలో జరిపిన పర్యటనలు ఈ క్రమాన్ని పరాకాష్టకు తీసుకెళ్లాయి. 2006 మార్చిలో బుష్ భారత పర్యటనకు ముందే అమెరికా రక్షణ శాఖ ఇరుదేశాల రక్షణ సంబంధాలు అమోఘంగా విస్తరిస్తున్నట్టు ప్రకటించింది. ఆ దేశంతో సంయుక్త విన్యాసాలు, ఆయుధ కొనుగోళ్లు కూడా వూపందుకున్నాయి. వాటి లోతుపాతులు చెప్పిన తర్వాత ప్రకాశ్ కరత్ అణు ఒప్పందం వివరాల్లోకి వచ్చారు. హైడ్ చట్టంతో అది భారత దేశ ప్రయోజనాలకు వినాశకరంగా మారిందని సోదాహరణంగా వివరించారు. 2005 జనవరి-మార్చి మధ్య మార్క్సిస్టులో ప్రచురితమైన ఈ వ్యాసం మొదటి రూపాన్ని తాజాపర్చి ఈ పుస్తకంలో మొదటి వ్యాసంగా ఇచ్చారు. ఇదొక్కటి చదివినా అమెరికా విషకౌగిలి పర్యవసానాలు మనకు తెలుస్తాయి.

'అణు ఒప్పందాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నామంటే', 'పార్లమెంటుకు మొహం చాటేయడమెందుకు?' అన్న రెండు వ్యాసాల్లోనూ ఆయన దీనిపై వామపక్షాల అభ్యంతరాలను స్పష్టం చేశారు. అమెరికా అనుకూల వైఖరికి సమర్ధన, ఇరాన్‌కు ద్రోహం అన్న తర్వాతి రెండు వ్యాసాలు అమెరికా మెప్పుకోసం మనం ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు చేయడాన్ని విమర్శిస్తాయి. అప్పట్లో దీనిపై సమాజ్‌వాది పార్టీ కూడా వ్యతిరేక ప్రదర్శనలు చేసింది. ముస్లిం మతస్తులలో ఇది ఆగ్రహావేశాలు రగిలించింది. అయితే ఈ విమర్శ సామ్రాజ్యవాద వ్యతిరేక కోణం నుంచి తప్ప మతపరమైన దృష్టి ప్రధానమైంది కాదని ఆయన వివరించారు.

అమెరికా భారత్‌లను ప్రపంచంలో రెండు పెద్ద ప్రజాస్వామ్య దేశాలుగా అభివర్ణిస్తుంటారు (సోషలిస్టు చైనాను పట్టించుకోకుండా). దీని కొనసాగింపుగా ఐక్య రాజ్యసమితి ప్రజాస్వామ్య నిధి ప్రహసనం ఒకటి తలపెట్టారు. దీనికి బుష్‌తో పాటు మన్మోహన్ సింగ్ కూడా ధారాళంగా విరాళం ప్రకటించి ప్రజాస్వామ్య యజ్ఞానికి సమిధలా మాట్లాడారు. అయితే ప్రపంచ దేశాల ప్రజాస్వామ్యానికి అమెరికానే పెద్ద ప్రమాదంగా వున్న తీరును 'బుష్ మార్క్ ప్రజాస్వామ్యానికి భారత్ సహకారం' అన్న ఆరవ వ్యాసంలో కరత్ ఎండగట్టారు. 'ప్రధాని అమెరికా పర్యటన', 'భారత అమెరికా రక్షణ సంబంధాల స్వరూపం' అన్న తదుపరి వ్యాసాలలో తాజా అవగాహన తర్వాత పెరిగిన వ్యూహాత్మక మైత్రి లోతుపాతులు విశ్లేషించారు. ఈశాన్య భారతంలో తీవ్రవాద శక్తుల దాడులను పరిశోధించడంలో అమెరికా గూఢచారి సంస్థ ఎఫ్‌బిఐ సహకారం గురించి అమెరికా రాయబారి ప్రతిపాదనను బిజెపి అధినేత అద్వానీ హర్షించడంపై 'ఎఫ్‌బిఐకి అద్వానీ వత్తాసు' అన్న వ్యాసంలో పరిశీలన వుంది.

ఈ పుస్తకం ద్వితీయార్థంలో వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో అమెరికాకు జోహుకుం అన్న వైఖరిని సాంగోపాంగంగా పరిశీలించారు. 'సైనిక భద్రతా సహకారం భారత సార్వభౌమత్వం' అన్న వ్యాసం వాటిలో మొదటిది. తర్వాత 'సైనికరంగంలో రహస్య ఒప్పందాలు' అనే అధ్యాయం వస్తుంది. ఇలాంటివే మరో మూడు వ్యాసాలున్నాయి. 'వాషింగ్టన్ కొలువులో జస్వంత్ సింగ్ విన్యాసాలు' అన్న వ్యాసం ఇప్పుడు ఎన్నో ప్రగల్భాలు పలుకుతున్న సదరు పెద్ద మనిషి అప్పుడు వేసిన వేషాలు ఎలావున్నది గుర్తు చేస్తుంది. 'ప్రజాస్వామ్య సమూహంలో భారత్ చేరిక పేరిట' అమెరికాకు అంటకాగిన వైనాన్ని ఆఖరి అధ్యాయం వివరిస్తుంది.

మొత్తంపైన ఇవన్నీ చదివిన తర్వాత అమెరికాతో అణు ఒప్పందం హఠాత్పరిణామం కాదనీ, దీర్ఘ కాలంగా పాలకవర్గాల నడకే అటు వైపుగా సాగుతున్నదని అర్థమవుతుంది. విదేశాంగ విధానాన్ని ప్రజలకు వివరించకుండా దాగుడుమూతలాడే పాలకుల కుట్రల నుంచి దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవలసింది ఆ ప్రజలేనని సందేశమిస్తుంది.

సూటిగా సుబోధకంగా వున్న ఈ సమయోచిత వ్యాసాలను గుడిపూడి విజయరావు చక్కగా అనువదించి అందించారు. ప్రస్తుత వాతావరణంలో తప్పని సరిగా చదవవాల్సిన పుస్తకం ఇది.

ప్రకాష్ కరత్

జూనియర్ భాగస్వామి

అణు ఒప్పందం

భారత్ అమెరికా వ్యూహాత్మక సంబంధాలు

వెల: 40/-, పేజీలు: 102

ప్రతులకు:

ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1/2,

చిక్కడపల్లి,

హైదరాబాద్. అన్ని బ్రాంచీలు.

✲





సీరియల్

మూలం : **బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)**

తెలుగు సేత: **ముక్తవరం పార్థసారథి**

అమెరికన్ డేగ

జరిగినకథ:

యూట్‌లను అదుపులో పెట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటామని గవర్నర్‌కు సందేశం పంపుతూ, రిజర్వేషన్ నిర్వహణలో మీకర్ అసమర్థతను ఎత్తిచూపుతూ మరో శ్రీముఖం కూడా జారీ చేసింది ప్రభుత్వం. మీకర్ హడావిడిగా ఇండియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశాడు. ఐతే ఇప్పటికే వాళ్ళు గవర్నర్ మీదా, మీకర్‌మీదా కోపంతో రగిలిపోతున్నారు. డెన్వర్ వార్తాపత్రికలు చదివే ఒక తెల్లజాతి మిత్రుడు, పెక్, నికాగట్ (జాక్) కు తాజావార్తలు చేరవేస్తూనే ఉన్నాడు.

అతి కష్టంమీద, గవర్నర్ పిట్కిన్‌తో ఇంటర్వ్యూ సంపాదించుకోగలిగాడు జాక్. "మీ ప్రాంతంలో పరిస్థితులు ఎలా ఉన్నాయని అడిగాడు గవర్నర్. మీకర్, దిగజారుతున్న శాంతిభద్రతల గురించి ఓ లేఖ రాశాడట?" అవునండీ, అతడికి ఇంగ్లీష్ వస్తుంది గనక రాశాడు. నేను స్వయంగా మిమ్మల్ని దర్శించుకోవటానికి వచ్చానని చెప్పాను. థాంప్సన్ ఇల్లు ఎందుకు తగలబెట్టావన్నాడు. ఏంచెప్పను? అప్పుడే చూచివెళ్ళానాయే. ఈ ఏజెంట్ (మీకర్) మా మీద చాడీలు చెప్తున్నాడు. అతణ్ణి మార్చమని వాషింగ్టన్‌కు రాయమని చెప్పాను".

అయితే, పిట్కిన్‌కు మీకర్‌ను మార్చే వుద్దేశం లేదు. అంతా తనకు అనుకూలంగానే జరుగుతున్నది. ఇక మీకర్ ఆ ఇండియన్‌మీద యుద్ధం ప్రకటించి తప్పుకోవాలనుకున్నాడు. దీని వల్ల యూట్ కోపం మరింత పెరుగుతుందని తెలుసు. పిట్కిన్ ప్రోత్సహిస్తున్న "యూట్స్ మస్ట గో" కార్యక్రమానికి మీకర్ సహకరించినట్టుగా స్పష్టమైన సాక్ష్యాధారాలు లేవుగానీ, తనకు చేసిన పనులన్నీ యూట్స్‌కు నష్టం కలిగించాయి.

సెప్టెంబర్ మొదటివారంలో, తన తెల్ల ఉద్యోగి షాడ్రాక్ ప్రైస్‌ను 'రేసింగ్ ట్రాక్' దున్నమని ఆదేశించాడు. ఇది యూట్‌లకు ప్రాణప్రదమని అతడికి తెలుసు. గుర్రాల రేసులు లేకుండా వాళ్ళు బ్రతకలేరు. అక్కడ దున్నటం ఆపాలని కొందరు యూట్ యువకులు నిరసన తెలియజేశారు. తమ ప్రదేశంలో భవనాలు కట్టడం వల్ల, గుర్రాలకు కావలసిన గడ్డి కూడా దొరకటం లేదు. కాస్త దూరంగా దున్నితే తాను కూడా సాయం చేస్తానన్నాడు క్వింకెట్ (డగ్లస్). కానీ వీళ్ళ గొంతెమ్మ కోర్కెలకు లొంగేది లేదని మీకర్ అప్పటికే నిర్ణయించుకున్నాడు. చర్చలు, విజ్ఞాపనలు విఫలం కావడంతో కొందరు యూట్‌లు రేసింగ్ ట్రాక్ వద్దకు రైఫిళ్ళతో వెళ్ళి పనులు ఆపమన్నారు. షాడ్రాక్ ప్రైస్, మీకర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సారి , యూట్‌లు హెచ్చరించగా గాలిలో కాల్పులు జరిపారు. ప్రైస్ పారిపోయాడు.

కోపం పట్టలేని మీకర్, కమీషనర్ ఆఫ్ ఇండియన్ అఫైర్స్ కో లేఖ సంధించాడు. "వీళ్ళకు ఇన్నాళ్ళు ఉచిత రేషన్లిచ్చి నెత్తినెక్కించుకున్నాం. పనీపాట చెయ్యటం మరిచారు. ఇప్పుడు భూమిమీద హక్కు కూడా తమకే ఉందంటున్నారు".

ఆ మధ్యాహ్నామే కనాలా (జాన్సన్), మీకర్‌తో ఇలా మొరపెట్టుకున్నాడు "అది అసైన్డ్ భూమి, నాకు రాసిచ్చారు. ఇప్పటికైతే దున్నటం ఆపారు, సంతోషం. ఇక మీదట మీ వాళ్ళు అటు రాకపోతే మంచిది".

"గుర్రాల గడ్డికోసం భూమి కావాలంటున్నారు. అసలు, అన్ని గుర్రాలు మీకెందుకు? కొన్నింటినైనా చంపండి" అంటూ సలహా ఇచ్చాడు మీకర్.

తన ఏజెంట్ మాటల్ని నమ్మలేక పోయాడు జాన్సన్. కోపంతో ఊగిపోతూ అతడి చొక్కా పట్టుకుని లాగి, వరండాలో ఓ మూలకి నెట్టాడు. ఆ తర్వాత, మరోమాట లేకుండా తన గుడారానికి నడిచిపోయాడు. ఈ సంఘటన గురించి, తరువాత జాన్సన్ ఇచ్చిన వాంగ్మూలం ఇలా రికార్డు చేయబడింది.

"దున్నటం తప్పని నేను ఏజెంట్‌కు నచ్చజెప్పటానికే ప్రయత్నించాను. నేనే అన్ని సమస్యలు సృష్టిస్తున్నానంటూ నిందించాడు ఏజెంట్. ఇలాగైతే, "కలాబూజ్" (జైలు)లో బంధిస్తానని బెదిరించాడు. నేను చేసిన నేరమేమిటో అర్థం కాలేదు. తనకేమీ అవగాహనలేదు. మరో ఏజెంట్ వస్తే తప్ప పరిస్థితులు మెరుగు పడవని చెప్పాను. అప్పుడు అతడి భుజాలు పట్టుకుని కాస్త వెనక్కు తోశాను. ఇదే నేను చేసింది. ఏజెంటును నేను నిందించలేదు. కొట్టలేదు. కేవలం భుజాలు పట్టుకున్నాను. నాకేమీ మతిభ్రమించలేదు. అతడిమీద దాడి ఎందుకు చేస్తాను?"

ఆ తర్వాత మీకర్, నికాగట్ (జాక్)ను తన ఆఫీసుకు పిలిపించాడు. ఆ సమావేశం గురించి జాక్ ఇలా చెప్పాడు

"జాన్సన్ చేసింది చాలా చిన్న పొరబాటు. మరచిపొమ్మని సలహా ఇచ్చాను. కానీ మీకర్ కోపంలో ఉన్నాడు. ఫిర్యాదు చెయ్యక తప్పదన్నాడు. ఎందుకు దీన్నింకా లాగటం? "నేనింకా వృద్ధుణ్ణి, జాన్సన్ యువకుడు. అతడితో నేను పోట్లాడలేను" అన్నాడు మీకర్.

ఇన్నాళ్ళూ ఇక్కడికి సైనికులు రాలేదు. కమీషనర్‌ను అడిగి సాయుధ బలగాల రక్షణలోనే ఇక మీదట పనులు జరుగుతాయన్నాడు. ఇంతకుమించిన భూమి యూట్‌లకెందుకు? రిజర్వేషన్‌లో వుంటే సరిపోతుందన్నాడు. "ఇది ప్రభుత్వ భూమి. మీకు హక్కులేదు" అంటూ వాదించాడు. "ఇక్కడ ఏజెన్సీ పెట్టారంటే అర్థం, ఇది మా భూమి అని అంగీకరించినట్టే కదా?" అని అడిగాను. కనీసం, జాన్సన్ తొందరపాటువల్ల ఇంతపెద్ద నిర్ణయాలన్నీ తీసుకోవటమెందుకో అర్థం కాలేదు".

రెండు రోజులు తీవ్రంగా ఆలోచించి, యూట్‌లకు గుణపాఠం చెప్పక తప్పదని నిర్ణయించుకున్నాడు మీకర్. సైనికులను పంపమని గవర్నర్ పిట్కిన్‌కు టెలిగ్రాం పంపాడు. కమీషనర్ అఫ్ ఇండియన్ అఫెయిర్స్‌కు కూడా ఫిర్యాదు చేస్తూ లేఖ రాశాడు.

"జాన్సన్ (యూట్ నాయకుడు) నామీద దాడి చేసి గాయపరిచాడు. మనకు వ్యతిరేకంగా ఇండియన్లను పురిగొల్పుతున్నది అతడే అని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అతని కొడుకు మన వ్యవసాయ కార్మికుల మీద కాల్పులు జరిపాడు. ఇప్పుడు పొలం పనులన్నీ ఆగిపోయాయి. జనరల్ పోప్‌తో సంప్రదించి తగిన నిర్ణయం తీసుకోవలసినదని గవర్నర్ పిట్కిన్‌ను అర్థించాను".

ఆ తర్వాతి వారాల్లో, ఇంటీరియర్ మరియు వార్ డిపార్ట్‌మెంట్లలో ఈ విషయం గురించి సుదీర్ఘ ఆలోచనలు జరిగాయి. త్వరలోనే అశ్విక దళాలు వైట్ రివర్‌ను తమ అదుపులోకి తీసుకోబోతున్నాయని మీకర్‌కు సందేశం చేరింది. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తున్నారని భావించిన వాళ్ళందర్నీ అరెస్టు చెయ్యడానికి ఏజెంటుకు పూర్తి అధికారం కూడా ఇచ్చింది ప్రభుత్వం.

ఫోర్ట్ ఫ్రెడ్ స్టీల్‌ను కమాండ్ చేస్తున్న మేజర్ థామస్ టి. తార్న్‌బర్గ్‌ను "అవసరమైన బలగాలతో కొలరాడో వైట్ రివర్ యూట్ ఏజెన్సీకి సత్వరం కదలమ"ని వార్ డిపార్ట్‌మెంట్ మరో ఆదేశం కూడా జారీ చేసింది. అయితే అప్పటికి, తార్న్‌బర్గ్ ఎల్క్ (జింక జాతి జంతువు) వేటలో వుండటం వల్ల, ఆజ్ఞలు ఆయనకు చేరడంలో ఆలస్యమైంది. మొత్తం మీద సెప్టెంబర్ 21 నాడు యూట్ వేటకు బయల్దేరాడు ఆ మేజర్. అతని వెంట సుమారు 200 మంది అశ్వికులూ, పదాతి సైనికులూ 150 మైళ్ళ ప్రయాణం ప్రారంభించారు.

సెప్టెంబర్ 25నాడు ఫోర్టిఫికేషన్ క్రీక్ చేరాడు తార్న్‌బర్గ్. తన రాక గురించి మీకర్‌కు తెలియ చేయటానికి ఒక గైడ్‌ను కూడా పంపాడు. మరో నాలుగు రోజుల్లో వైట్ రివర్ పూర్తిగా తమ స్వాధీనం కాబోతున్నది. ఒక వేగులవాడు వచ్చి, కాలరో, నికాగట్ (జాక్) లకు సైనికుల కదలికల గురించి చెప్పాడు. అప్పటికి, యూట్‌లు, వేట కోసం, మిల్క్ రివర్‌కు వెళ్ళటానికి సన్నాహాలు చేసుకుంటున్నాడు.

జాక్ హడావిడిగా బేర్ రివర్ చేరుకుని

కలరో కోరిక ప్రకారం , తార్న్‌బర్గ్, తన ఆఫీసర్లతో సమావేశం జరిపి , వ్యూహం మార్చాడు. సైనికులు అక్కడ ఉండటం క్షేమకరం కాదు. అందరూ కోల్‌క్రీక్ కాన్యన్ చేరుకోవటం మిలిటరీ అవసరం. కలరో, జాక్‌ల నెలా నమ్మగలం? మిల్క్ రివర్ వాళ్ళకనుకూల ప్రదేశం. ఒకవేళ, యూట్‌లు ఎదురుదాడి చేస్తే రక్షించుకోవాలన్నా, మరికొన్ని మైళ్ళు ముందుకు కదిలి సురక్షిత స్థావరానికి చేరుకోక తప్పదు.

"ఎందుకు వస్తున్నారు? మీతో మాకే తగువూ లేదు. ప్రశాంతంగా బతకనివ్వండి" అంటూ సైనికులను బతిమాలాడు.

ఏజెన్సీ నుండి టెలిగ్రాం వచ్చినందువల్లనే సైన్యం అక్కడికి చేరిందని చెప్పాడు తార్న్‌బర్గ్. "ఇండియన్లు అడవుల్ని తగలబెడుతున్నారు. థాంప్సన్ కేబిన్‌ను మంటలపాలు చేశారు". అంతా అబద్ధం. మేమేమీ తగలబెట్టలేదు. నామాట నమ్మండి. నా పేరు నికాగట్. నేను స్వయంగా మిమ్మల్ని ఏజెన్సీకి తీసుకెళ్ళి చూపిస్తాను. సైనికులను మాత్రం వెంట తేవద్దు" అన్నాడు జాక్. "మీకర్ స్వయంగా కోరితే తప్ప సైన్యం ఆగదు" అంటూ కరాఖండిగా చెప్పాడు తార్న్‌బర్గ్.

సైనికులను చూసి రిజర్వేషన్‌లో అమాయకులు భయపడతారు. "మాకెవ్వరికీ యుద్ధం చేసే కోరిక లేదని" పదే పదే విన్నవించుకున్నాడు నికాగట్. "కనీసం 'నిక్' మీకర్

కన్నా చెప్పి తార్న్‌బర్గ్‌ను ముందుకు కదలకుండా ఆపాలి".

మీకర్ ఆఫీసుకు పరిగెత్తాడు నికాగట్. దారిలో క్వింకెట్ (డగ్లస్) నివాసం కనిపించింది. ఇద్దరూ వేర్వేరు తెగలకు నాయకులు. కానీ వైట్‌రివర్ యూట్‌ల మనుగడకే ముప్పువాటిల్లిన ఈ క్షణాన, తమ మధ్య వున్న తేడాలను మరచి సమిష్టిగా ప్రయత్నించాలి. అప్పటికే యూట్‌ల మధ్య అనేక పుకార్లు వ్యాపించాయి. అందర్నీ "ఇండియన్ టెరిటరీ" కి పంపిస్తారనీ, ఒక వ్యాగన్ నిండా సంకెళ్ళు, గొలుసులు, తాళ్ళు తెచ్చి అందరి కాళ్ళూ, చేతులూ కట్టి పడేస్తారనీ, నేరాలు చేసిన వాళ్ళను ఇకమీదట ఉరి తీస్తారనీ. "యుద్ధం చేసి చస్తాం గానీ లొంగం" అన్నారు కొందరు యువకులు. "సమవుజ్జీలతో మాత్రమే పోరాడాలి. వాళ్ళు మనల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చేస్తున్నారన్నాడు డగ్లస్. అందరూ వెళ్ళిపోయిన తర్వాత, తన నివాసం మీద అమెరికన్ పతాకం ఎగురవేశాడు జాక్ (అది తనను రక్షిస్తుందని నమ్మకం). 1864లో సాండ్‌క్రీక్‌వద్ద అమెరికన్ పతాకం ఎగురవేసిన షెయెనీలను (బ్లాక్‌కెటిల్ అనుచరులు) సైనికులు వూచకోత కోసిన విషయం అతనికి తెలీదు.

"సైనికులు కదలి వస్తున్నారు. రక్షించమని మీకర్‌ను వేడుకున్నాను. కానీ అతడు ఈ విషయంలో కలగచేసుకోవడానికి నిరాకరించాడు. ఎంత బతిమాలినా వినలేదు. చివరికి మరో గదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు. అదే నేను అతనిని చివరిసారి చూడటం" అని గుర్తు చేసుకున్నాడు జాక్.

సాయంత్రం దాకా గదిలోనే గడిపిన మీకర్‌కు పునరాలోచన మీద జాక్ సలహా సబబుగానే తోచింది. సైన్యాన్ని ఏజెన్సీకి తీసుకురావద్దని తార్న్‌బర్గ్‌కు అర్జెంటుగా సందేశం పంపాడు. "సైనికులంటే ఇండియన్ల దృష్టిలో యుద్ధమే".

మరునాడు (సెప్టెంబర్ 28) తార్న్‌బర్గ్ విడిది చేసిన డీర్‌క్రీక్‌కు కలరో కూడా చేరుకుని శాంతి నెలకొల్పవలసిన అవసరాన్ని పునరుద్ఘాటించాడు. అప్పటికి వైట్ రివర్ ఏజెన్సీ నుండి కేవలం ముప్పై అయిదు మైళ్ళ దూరంలో ఉంది.

కలరో కోరిక ప్రకారం , తార్న్‌బర్గ్, తన ఆఫీసర్లతో సమావేశం జరిపి , వ్యూహం మార్చాడు. సైనికులు అక్కడ ఉండటం క్షేమకరం కాదు. అందరూ కోల్‌క్రీక్ కాన్యన్ చేరుకోవటం మిలిటరీ అవసరం. కలరో, జాక్‌ల నెలా నమ్మగలం? మిల్క్ రివర్ వాళ్ళకనుకూల ప్రదేశం. ఒకవేళ, యూట్‌లు ఎదురుదాడి చేస్తే రక్షించుకోవాలన్నా, మరికొన్ని మైళ్ళు ముందుకు కదిలి సురక్షిత స్థావరానికి చేరుకోక తప్పదు.

29నాడు ఉదయం తొమ్మిదింటికి కలరో, ఏజెన్సీకి చేరుకున్నాడు. అప్పటికే కొందరు యుద్ధసన్నాహాలు చేసుకుంటున్నారు (సైనికులిప్పటికి ఎన్నిసార్లు మెరుపుదాడులు చేయలేదని! సంధి పత్రాల మీద సంతకాలు ఆరిపోకుండానే ఊచకోత కోశారు). ఆరవై మంది యువకులు ఆయుధాలు పట్టుకుని అసహనంగా తిరుగుతున్నారు. మీకర్‌తో సమావేశం సంతృప్తికరంగా లేదన్నాడు జాక్. సైనికులను మిల్క్ రివర్ వద్దే ఆపుదామని తార్న్‌బర్గ్ చేసిన వాగ్దానం తనకు సంతోషం కలిగించిందన్నాడు కలరో. "ఈ యువకులు యుద్ధ విన్యాసాలు మానుకుంటే మంచిది. మనం సైనికులను భయపెట్టకూడదు"

ఇంకా వుంది....

చందు

రాత్రికి రాత్రే మారిపోయింది

నేను చదివిన పుస్తకాలన్నీ ఫొటోగ్రఫీకి సంబంధించినవే. నాన్నగారు పోయిన తర్వాత ఆయన లైబ్రరీ నుంచి సి. నారాయణరెడ్డిగారు రాసిన 'కవిత నా చిరునామా' పుస్తకాన్ని తీసి చదివా. నాకిష్టమైన పుస్తకం అది. స్నేహితుడు మురళీ శ్రీనివాస్ ద్వారా క్రిష్ (గమ్యం దర్శకుడు) పరిచయమయ్యాడు. 'మీరు కవితలు చెబుతారంట కదా! ఏదీ చెప్పండి' అన్నారు. నేను చెబుతుండగా... సెల్ ఫోన్‌లో రికార్డ్ చేశారు. చెప్పడం పూర్తికాగానే 'నేను మీకు బ్రేక్ ఇస్తున్నాను' అన్నారు.

ఆర్. నారాయణ మూర్తి చేతుల మీదుగా 'గమ్యం' అర్థ శతదినోత్సవ జ్ఞాపిక అందుకుంటున్న రావురమేష్, గమ్యం చిత్ర దర్శకుడు క్రిష్

నటుడు 'రావు రమేష్' చెప్తోన్న కబుర్లు...

ఇక వారం రోజుల్లో బ్రేక్ వస్తుందనుకుంటే నెల, చివరికి రెండున్నర సంవత్సరాలు పట్టింది. ఎప్పుడు ఫోన్ చేసినా 'ఇంకో నెల రోజుల్లో దూకుతున్నాం. ఓపిక పట్టు' అని ధైర్యం నింపేవాడు. క్రిష్ చాలామంది నిర్మాతలకు కథ చెప్పాడు. కానీ సినిమా తీయడానికి ఎవరూ ముందుకు రాలేదు. చివరికి క్రిష్ నాన్నగారే రిస్క్ చేసి సొంతంగా 'గమ్యం' తీశారు. రెండున్నర ఏళ్ళ క్రితం 'నేను నీకు బ్రేక్ ఇస్తాను' అన్న క్రిష్ దృఢ సంకల్పం చాలా గొప్పది. 2008 ఫిబ్రవరి 29న 'గమ్యం' రిలీజైంది. మార్చి ఒకటిన శేఖర్ కమ్ముల నుంచి ఫోన్ వచ్చింది. అనీష్ దర్శకత్వంలో ఆయన నిర్మించే 'ఆవకాయ బిర్యాని' చిత్రంలో అవకాశం ఇచ్చారు. అటుపై 'దిల్' రాజు, యస్.యస్. రాజమౌళి చిత్రాల్లో బుక్ అయ్యాను. ఓవర్ నైట్‌లో కెరీర్ ఛేంజ్ అయిపోయింది. నా వర్క్ చూస్తేగానీ ఎదుటివాడికి నమ్మకం కలగదు. ఎందుకంటే చూడగానే ఆకట్టుకునేలా నా మొహం ఉండదు గనుక.

చీదటం... తాగటం... చెప్పడం...

నాన్నగారి వాయిస్‌కీ నా గాత్రానికీ సంబంధమే ఉండదు. 'గమ్యం'లో 'మీ వాయిస్ బాగుంది' అని చాలామంది అంటున్నారంటే... ఆ క్రెడిట్ చిత్ర రచయిత గంధం నాగరాజుగారికి దక్కుతుంది. రన్నింగ్ నోస్ (జలుబు వల్ల ముక్కు కారడం)తో డబ్బింగ్ చెప్పాల్సి వచ్చింది. అంత జలుబులో కూడా కూల్ వాటర్ తాగితే... నాగరాజుగారు తిట్టారు. మందులు వాడి రెస్ట్ తీసుకుని మరుసటిరోజు రమ్మన్నారు. యాంటీబయాటిక్స్ వాడి తర్వాత రోజు వెళ్ళాను. 'ఇవాళ కొంత బెటర్. రేపు రా' అన్నారు. మళ్ళీ ఆ మరుసటి రోజు వచ్చి ఒక డైలాగ్ చెప్పడం ఆలస్యం.... బైటికెళ్ళి గట్టిగా ముక్కు చీది, వేడి వేడి టీ తాగి మళ్ళీ డైలాగ్ చెప్పడం.... నాగరాజుగారే దగ్గరుండి డబ్బింగ్ చెప్పించుకున్నారు. 'బైటున్నాయ్ క్రూర మృగాలు. పీక్కుతింటున్నాయ్ జనాల్ని', 'తప్పులు అందరూ చేస్తారు. కానీ త్యాగాలు కొందరే చేస్తారు' వంటి అద్భుతమైన డైలాగ్స్ నాతో చెప్పించారు.

నాన్నగారి పేరు నిలబెడతావ్ : సిరివెన్నెల

'గమ్యం' ప్రారంభానికి ముందు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారి దగ్గరకు క్రిష్ తీసుకెళ్లాడు. నేను ఎవరిని కలిసినా 'మీ నాన్నగారండీ...' అంటూ ఆయన గొప్పతనం గురించే ముందు మాట్లాడుతుంటారు. ఎందుకంటే నేను చేసింది ఏమీ లేదు కాబట్టి. శాస్త్రిగారు మాట్లాడుతూ... 'నటనే కాకుండా సమాజం పట్ల, సాహిత్యం పట్ల, జనాల పట్ల, తన చుట్టూ వున్న పరిస్థితుల పట్ల అవగాహన వున్న నటులు కొద్దిమందే ఉంటారు. వాళ్ళలో నసీరుద్దీన్ షా, నానాపటేకర్, ప్రకాష్‌రాజ్, పరేష్‌రావల్, జగ్గయ్య, మీ నాన్నగారు ఉన్నార'న్నారు. 'గమ్యం' చూసిన తర్వాత ఆయన ఫోన్ చేసి 'నాన్నగారి పేరు నిలబెడతావ్' అంటూ అభినందించారు. క్రిష్‌తోపాటు వెళ్లినపుడు కేవలం నాన్నగారి నటన గురించే మాట్లాడిన సిరివెన్నెల సీతారామశాస్త్రిగారు ఫోన్ చేసి నన్ను అభినందించడం ఆనందంగా ఉంది.

ఓర్పు పట్టడంలో ట్రైనింగ్ అయ్యా

ఈ ఫీల్డ్ కొచ్చాక జీవితమంటే ఏంటో కొంత వరకు తెలిసొచ్చింది. అనుకున్నాం కదా అని అన్నీ జరగవు. జీవిత 'గమ్యం' చేరడానికి ముందు కాలం మనల్ని నలగ్గొడుతుంది. చిన్న విషయానికి కూడా నిరాశ పడేవాణ్ణి. ఇప్పుడది లేదు. ఇష్టమైన ఇద్దరు, ముగ్గురు ఫ్రెండ్స్ తప్పిస్తే ఎవరితోనూ మాట్లాడేవాణ్ణి కాదు. ఇక్కడ విభిన్న మనస్తత్వాల మనుషులను కలవడంతో వాళ్లతో ఎలా మెలగాలో అలవాటైంది. అసలు ఓర్పు లేని నాకు అదేమిటో నేర్పింది. 'పవిత్రబంధం' షూటింగ్ కోసం పొద్దున్నే ఏడింటికి వెళ్తే రాత్రి రెండింటికి నాకు సంబంధించిన షాట్ తీసేవాళ్ళు. ఉదయం ఏడెక్కడ? రాత్రి రెండెక్కడ? పేషెన్స్‌లో ట్రైనింగ్ అయింది ఇక్కడే. 'టైం బాగున్నప్పుడే భయపడాలి

మిత్రమా' అని ఓంకార్‌గారు ఓ మంచి పాయింట్ చెప్పారు. నెక్స్ బ్యాడ్ పిరియడ్ వస్తుందని దానర్థం. ఈ పాయింట్‌ను గుర్తు చేసుకుంటూ ముందుకు సాగుతున్నాను.

ప్రతి మనిషిలో యునీక్ ఎక్స్‌ప్రెషన్

ఒక వ్యక్తి వేలి ముద్ర మరొకరికి మ్యాచ్ కాదు. వేలిముద్రనేది యునీక్ (ఒక్కటే ఉంటుంది). అలాగే భగవంతుడు ప్రతి మనిషికీ ఒక యునీక్ ఎక్స్‌ప్రెషన్ ఇస్తాడు. దాన్ని డెవలప్ చేసుకుంటే నటుడిగా రాణిస్తాం. అయితే లక్ ఉండాలని చాలామంది అంటుంటారు. అదీ నిజమే. కొన్నిసార్లు మనం బాగా చేయకపోయినా అవతలి వాళ్ళని గొప్పగా ఎట్రాక్ట్ చేస్తుంటాం. ఇది దేవుడిచ్చిన గిఫ్ట్‌గా ఒప్పుకోవాలి. ఈఫిల్ టవర్ పక్కన అమితాబ్ బచ్చన్‌ను నిలబెడితే ఈఫిల్ టవర్‌ను చూడకుండా అమితాబ్ బచ్చన్‌నే చూస్తుంటారు. దీన్నే 'స్క్రీన్ ప్రిసెన్స్' (అందంగా కనిపించడం) అంటాం. అసలీ స్క్రీన్ ప్రిసెన్స్ ఎక్కడ్నుంచి వస్తుంది? సహజంగా రావాల్సిందే తప్ప...

పేరు తెచ్చి పెడతాయి

ఇప్పుడు నా అదృష్టం ఏంటంటే... వైవిధ్యభరితమైన పాత్రలొస్తున్నాయి. 'ఆవకాయ బిర్యాని', 'కొత్త బంగారు లోకం', రాజమౌళిగారి చిత్రంలో గుర్తింపు తీసుకొచ్చే పాత్రల్లో కనిపించబోతున్నాను. 'ఆవకాయ బిర్యాని'లో 'మాస్టర్జీ' అనే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. ఎంతోమందిని ఆడిషన్ టెస్ట్ చేసి చివరికి నన్ను ఎంపిక చేశారు. 'కొత్త బంగారు లోకం'లో అందరూ మెచ్చుకునే లెక్చరర్‌గా నటిస్తున్నాను. రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న రాజమౌళిగారి చిత్రంలో గుర్తుపట్టలేని గెటప్‌లో కనిపిస్తాను. అన్నీ మంచి పేరు తీసుకొస్తాయి.

నాన్నగారి పెళ్ళి అన్నవరంలో జరిగింది. ఓసారి నేనూ తమ్ముడు అన్నవరం వెళ్లాం. నాన్నగారిలా మనం కూడా ఇక్కడే పెళ్ళి చేసుకోవాలని సరదాగా అనుకున్నాం. అదే నిజమైంది. అన్నవరంలో ఒకే రోజు వేర్వేరు కళ్యాణమండపాల్లో వేర్వేరు ముహూర్తాల్లో పెళ్ళి చేసుకున్నాం. నాది పెద్దలు కుదిర్చిన వివాహమే. మాకొక బాబు, ఒక పాప. బాబు ఐదో తరగతి చదువుతున్నాడు. పాప ఎల్.కె.జి.

నాన్నగారి గౌరవం చెడగొట్టకుండా...

'మీ నాన్నగారు బాగా తెలుసు... నాకు మంచి ఫ్రెండ్' అని అనడం సహజం. కానీ 'నేనంటేనే మీ నాన్నగారికి చాలా ఇష్టమండి' అని చాలామంది చెబుతుంటే ఆశ్చర్యమేస్తుంది. నాన్నగారితో ఒకసారి కలిసి ఒక్క నిమిషమైనా మాట్లాడితే చాలు... ఆయన పంచిపెట్టిన ఆప్యాయతను జీవితంలో మర్చిపోలేదన్న మాట! ఆయన అజాతశత్రువు. ఎవరినీ నొప్పించేవారు కాదు. నాన్నగారి గౌరవం చెడగొట్టకుండా తెలుగు, తమిళ భాషల్లో మంచి ఆర్టిస్టుగా వైవిధ్యభరితమైన పాత్రలు పోషించాలన్నది నా కోరిక.

(అయిపోయింది)





తాతయ్య

చింటు: తాతయ్యా నువ్వు గట్టి వస్తువులను నమలగలవా?

తాతయ్య: నాకు పళ్లు లేవు. అయినా ఎందుకడుగుతున్నావ్ ?

చింటు: ఏం లేదులే నేను ఆడుకోవటానికి వెళుతున్నా, ఈ బఠానీలు నీదగ్గర ఉంచు.



ఊరట

రచయిత: సార్! నా నవల ఎలా ఉంది?

ప్రచురణకర్త: అబ్బో చివరి మాటలు ఎంతో ఊరటనిచ్చాయి!

రచయిత: (సంతోషంగా) ఏ మాటలు సార్ అవి?

ప్రచురణకర్త: సమాప్తం !!

కాగితప్పు ఉల్లిపాయలు



హాయ్ నేస్తాలూ... ఈ రోజు మనం కాగితంతో ఉల్లిపాయలు చేసేద్దాం చేయడం నేర్చుకుందామా. వీటిని ఇంట్లో ఏ గదిలోనైనా వేలాడదీయొచ్చు. కలర్‌ఫుల్‌గా చాలా బావుంటాయి. పైగా తయారు చేయటానికి మనకు ఇంట్లో ఉన్న వస్తువులు చాలు. చేయటం కూడా చాలా ఈజీ తెలుసా.

కావలసిన వస్తువులు: మందపాటి రంగు కాగితాలు (బ్లూ, ఆకుపచ్చ, పసుపు... ఇలా ఏ రంగైనా), స్కేలు, కత్తెర, గమ్, స్టాప్లర్, దారం, సిల్వర్ లేదా గోల్డ్ కలర్ డెకరేటింగ్ పేపర్

తయారు చేయు విధానం: ముందుగా మందంగా ఉన్న కలర్ పేపర్స్‌ను ఒక సెంటీమీటర్ వెడల్పున, 11 సెంటీ మీటర్లు పొడవున కట్ చేసుకోవాలి. వీటిలో కూడా అన్నీ ఒకే పొడవు కాకుండా కొన్నింటిని 6 సెంటీమీటర్లు, 7 సెంటీ మీటర్లు, 9సెంటీ మీటర్లు, 11 సెంటీమీటర్లు పొడవు ఉండేట్టుగా కట్ చేసుకోవాలి. మధ్యలో 6 సెంటీ మీటర్లు ఉన్న పేపర్‌ను పెట్టుకుని దానికి రెండువైపులా 7సెంటీమీటర్లు ఉన్న పేపర్‌ను పెట్టి రెండు పేపర్లను రెండు చివరలు పట్టుకుని గమ్‌తో అతికించాలి. అలాగే దానికి పక్కన 9,11 సెంటీమీటర్లు ఉన్న పేపర్ ముక్కలను కూడా వాటికి చివరలు అతికించి స్టాప్లర్‌తో పిన్ చేయాలి. ఇలా చేయటం వల్ల అవి ఒకదానినుండి మరొకటి ఊడిపోకుండా ఉంటాయి. వీటికి మధ్యలో సిల్వర్,గోల్డ్ కలర్ పేపర్ ముక్కలను కూడా పెట్టొచ్చు. ఇప్పుడు దీనికి ఒక చివర వేలాడదీయటానికి వీలుగా దారం కట్టాలి. ఇలా ఐదారు తయారు చేసి మన ఇంట్లో వేలాడదీస్తే... చూడండి. అందరూ అడుగుతారు. ఎక్కడ కొన్నారని..? మరి తయారీ మొదలెడదామా!



మెదడుకు మేత



హాయ్ ఫ్రెండ్స్ ... ఇక్కడ కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. వాటిని చదివి ఆన్సర్లేమిటో కనిపెట్టాలి. ఇవి పెద్ద కష్టమైన ప్రశ్నలేమీ కాదు. చాలా సింపుల్. అసలే మీరు చాలా తెలివైన వాళ్లు కదా! ఈజీగా కనిపెట్టేయగలరు. మరింక అలస్యమెందుకు! మొదలెట్టండి?

❖ 8 అనే అంకెతో 1000ని చేయగలరా? 8 అంకెను ఎన్ని సార్లయినా వేసుకోవచ్చు , ఇంక ఆలస్యమెందుకు ప్రయత్నించండి.

❖ మీకో చిన్న ప్రశ్న. అదేమిటంటే పది కేజీల ఐరన్ రాడ్, పది కేజీల ప్రత్తి ఉన్న నంచిని 50 మీటర్ల ఎత్తునుండి కిందకి వేశామనుకోండి. ఏ వస్తువు ముందుగా కింద పడుతుంది.?

888+88+8+8+8 = 1000

కనుక్కోండి

నేస్తాలూ... ఇక్కడున్న బొమ్మలో సముద్రం, దాని ప... కొండమీద చెట్లు కనిపిస్తున్నాయి కదా. క... బాగా పరిశీలించి చూడండి. ఇంకా ఏం కనిపిస్తుందో!

బాలనేస్తాలు

తేడాలు కనిపెట్టండి





పిల్లలూ...

ఈ రెండు బొమ్మల్లో ఆరు తేడాలు ఉన్నాయి. అవేంటో కనిపెట్టి సున్నా చుట్టండి. మీకు ఒక్కనిమిషం మాత్రమే టైమిస్తున్నాం.. ఆలస్యం కాకూడదు మరి సరేనా!

చిన్నారి చిత్రకారులు

బి. అంబేద్కర్, 7వ తరగతి, జడ్.పి.హెచ్.స్కూల్, చినకాకాని, మంగళగిరి, గుంటూరు.



ఎ. సుధాకర్, 8వ తరగతి, ఎ.పి.ఎస్.డబ్ల్యు.ఆర్. స్కూల్, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా.

పిల్లి విశేషాలు

హలో నేస్తాలూ... మీకుపిల్లి గురించి తెలుసా? ఏంటీ పిల్లి గురించి ఏముంది తెలుసుకోడానికి అనుకుంటున్నారా! వీటిని చదివితే అమ్మో! పిల్లి గురించి మనకి తెలియని విషయాలు ఇన్ని ఉన్నాయా... అని మీరే అనుకుంటారు. చదవండి మీకే తెలుస్తుంది, మేం చెప్పింది నిజమో, కాదో...

- మనిషి గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకుంటుందో దానికి రెట్టింపు సార్లు పిల్లి గుండె కొట్టుకుంటుంది (సుమారుగా నిమిషానికి 140 సార్లు).
- పిల్లికి 290 ఎముకలు, 527 కండరాలు ఉంటాయి.
- దీనికి మనిషికన్నా 5 వెన్నుపూసలు ఎక్కువ ఉంటాయి.
- వినికిడి శక్తి కూడా మనిషికంటే ఎక్కువే. ఎంత ఎక్కువంటే మనిషి వంద అడుగుల దూరంలో ఉన్నాకూడా గుర్తుపడుతుంది.
- అంతే కాకుండా రెండింతల ఎక్కువైన శబ్దతరంగాలను కూడా భరించగలుగుతుంది.
- దీనికి శరీర ఉష్ణోగ్రత కూడా ఎక్కువే. మనం టెంపరేచర్ చూసుకున్నప్పుడు థర్మామీటర్‌లో 102 కనిపించగానే 'అమ్మో! జ్వరం వచ్చేసింది' అని కంగారు పడ్తాం, కానీ పిల్లికి మామూలు శరీర ఉష్ణోగ్రతే అంత ఉంటుంది తెలుసా!
- మీరెప్పుడైనా గమనించారా! పిల్లులు మనుషులను చూసినప్పుడు మాత్రమే "మ్యావ్" అని అరుస్తుంది. తోటి పిల్లులను చూసినపుడు అది చాలా అరుదుగా మ్యావ్ అని అరుస్తుంది.
- ఏ రెండు పిల్లుల ముక్కు రంధ్రాలూ ఒకేలా ఉండవట. మనిషి వేలిముద్రల్లా.
- పిల్లికి మనిషికన్నా వాసన గ్రహించే శక్తి 14 రెట్లు అధికం.

తెల్సా!

❄

పానుగంటి చంద్రయ్య

కళలన్నింటిలోకి పురాతనమైనది శిల్పకళ. రూపాన్ని వూహించడం, శిలపై సుతారంగా చెక్కడం గొప్ప నైపుణ్యంతో కూడింది. ఇది మిగిలిన కళలకన్న ఎక్కువ కాలం నిలిచి వుంటుంది. లలిత కళల్లో ముఖ్యమైన ఈకళ మానవునికి మానసిక ఆనందాన్ని, పరవశాన్ని కలిస్తుంది. అసలు శిల్పకళ ప్రధాన ప్రయోజనమే ఇంద్రియానందం కలిగించడం. రామాయణ, మహాభారతం వంటి పురాణ గాథలను రాళ్లపై చెక్కిన ఉద్దండులు మన శిల్పులు. శిలలపై మనవాళ్లు చెక్కిన శిల్పాలు సృష్టికే అందాలు తెచ్చాయి. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో ప్రపంచప్రఖ్యాతి గాంచిన శిల్పులు ఉన్నారు. మన దేశంతోపాటు శ్రీలంక, అమెరికా, మలేషియా, సింగపూర్ వంటి దేశాలకు ఆళ్లగడ్డ శిల్పులు చెక్కిన శిల్పాలు ఎగుమతి చేయడం విశేషం. అంతటి ప్రాముఖ్యత కల్గిన ఆళ్లగడ్డ శిల్పులు, శిల్పాల గురించి తెలుసుకోవాలని ఎవరికుండదు చెప్పండి! అసలు శిల్పాలు చెక్కడానికి ఎలాంటి రాళ్లను ఎంచుకుంటారు? పెద్దపెద్ద శిల్పాలను చెక్కేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు? కొలతలు ఎలా తీసుకుంటారు? అసలు ఏ వయసులో ఈ విద్యను నేర్చుకుంటారు? వంటి ఎన్నో ఆసక్తికర వివరాల సమాహారమే ఈ కథనం.

అపర బ్రహ్మలు ఆళ్లగడ్డ శిల్పులు

కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డలో శిల్పకళాకారులు నేటికీ తమ వంతు నిరంతర కృషి చేస్తున్నారు. అతి కఠినమైన బండరాళ్లను సైతం మెత్తని వెన్న ముద్దలుగా మార్చి కోరిన ఆకృతుల్లో శాస్త్రీయ పద్ధతుల్లో, జీవకళ వుట్టి పడేలా అనుకున్న హావభావాలను ప్రతిబింబించడంలోనూ పురాణ గాథలకు అనుగుణమైన రీతిలో నవరస భావాలను నవ్యరీతులలో నవనవోన్మేషంగా రూపుదిద్దడంలో మన శిల్పకళాకారులు అభినవ బ్రహ్మలుగా పేరుగాంచారు. అందుకే "శిలలపై శిల్పాలు చెక్కినారు. మనవాళ్లు సృష్టికే అందాలు తెచ్చినారని" అన్నారు ఆత్రేయ. "ఈనల్లని రాల్లలో ఏ కన్నులు దాగెనో... ఈబండల మాటున ఏ గుండెలు మోగెనో" అన్నారు సి.నారాయణరెడ్డి. భారతీయ స్త్రీ మూర్తిని అపురూప రూపవతిగా, ఆరాధ్య దేవతగా, పల్లెపడుచుగా, నాట్యసుందరిగా విభిన్న రూపాల్లో, విభిన్న పరిమాణాల్లో, వివిధ ఆకృతుల్లో పరవసింప చేసేలా సృజించగల కళా స్రష్టలు మన శిల్పాచార్యులు. వీరికి ఉలి ఆధారం. మన సంస్కృతి నాగరికతలను ప్రతిబింబించే ప్రజల వేషవస్త్రాభరణాలు, రూపలావణ్యములు, సహజ మూర్తిమత్వాలు చూడముచ్చటైన కనుముక్కు తీరులు, గృహోపకరణాలు, రథాలు, రాజభవనాలు, ఆరాధనాలయాలు, అంతఃపురాలు ఇలా ఎన్నింటినో శిల్పుల హస్తప్రావీణ్యం ద్వారా మనం తెలుసుకోగలుగుతున్నాం.

శిల్పకళకు భారతదేశం ప్రసిద్ధమైతే ఆళ్లగడ్డలో శిల్పకళకు ఆద్యులయిన దురుగడ్డ బాలవీరాచారి కుమారులు రామకృష్ణమాచార్యులు, దురుగడ్డ రవీంద్రాచారితో పాటు మొత్తం 30 మంది శిల్పకళపై ఆధారపడి ఉన్నారు. వీరు దాదాపు 300 మందికి ఉపాధి చూపుతున్నారు. ఇక్కడి శిల్పులు దేశనాయకులు, దేవతా విగ్రహాలు, దేవాలయాలు, ధ్వజస్తంభాలు, గర్భగుడులు, ఆలయ గోపురాలు తయారు చేస్తారు. కడపజిల్లా జమ్ముల మడుగు, మైసూరు, మహాబలిపురం తదితర ప్రాంతాలనుండి నలుపు, తెలుపు, ఎరుపు రాళ్లను విగ్రహాల తయారీ కోసం తెప్పించుకుంటారు. ఇక్కడి శిల్పులు తయారు చేసిన మూర్తులను చూస్తే రాళ్లకు జీవం పోసినట్లు కనబడుతుంది. భక్తి భావం ఉన్న వారు ఎక్కువగా దేవతల విగ్రహాలను తయారు చేయించుకుంటారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు జరిగే సమయంలో ఎక్కువగా ఆర్డర్లు వస్తుంటాయి.

ఈ వృత్తి ఆరుతరాల నుండి ఆళ్లగడ్డలో కొనసాగుతోంది. ఆరో తరం వారు నేటికీ ఈ వృత్తిని నమ్ముకునే ఉన్నారు. ఐదోతరానికి చెందిన రామకృష్ణమాచారి మైసూరు సచ్చిదానంద స్వామి ఆస్థాన శిల్పులుగా ఉన్నారు. ఆయన సోదరుడు దురుగడ్డ రవీంద్రాచారి, కుమారులు కూడా ఈ వృత్తిలో కొనసాగుతున్నారు. బాలవీరాచారి కుమారుల్లో ఒకరైన ప్రసాద్ ఈ కళలో జాతీయ స్థాయి అవార్డు పొందగా, మరో కుమారుడు రామకృష్ణమాచారి శిష్యులు పిట్స్‌బర్గ్‌లో (అమెరికా) నిర్మించిన వేంకటేశ్వర దేవాలయ నిర్మాణంలో పాలుపంచుకున్నారు.

శిల్పుల జీవన విధానం

శిల్పకళను పూర్వం రాజులు పోషించే వారు. శిల్పులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించి గుళ్లు, గోపురాలు నిర్మించుకునేవారు. రాజరిక వ్యవస్థ పోయాక ఒక దశలో వారికి ఉపాధి కరువయ్యింది. దేవాలయాలు, విగ్రహాలను తయారు చేయించుకునే వారి సంఖ్య పెరుగుతున్న క్రమంలో వారికి చేతినిండా పని దొరుకుతుంది. 1986లో ఎన్‌టి రామారావు

మా పిల్లలను ఈ వృత్తిలోకి దించలేదు

శిల్పకళకు ప్రభుత్వ ప్రోత్సాహం లేదు. నేను 28 సంవత్సరాలుగా ఈవృత్తిలో ఉన్నాను. 12 ఏళ్ల వయసునుండే కళను నేర్చుకున్నాను. చాలా విగ్రహాలు చేశాం. ఈమధ్య కాలంలో శ్రీలంకలోని కొలంబోలో నేను తయారు చేసిన 22 అడుగుల బుద్ధవిగ్రహాన్ని ఆవిష్కరించారు. 23 అడుగుల రాయిని కడపజిల్లా పులివెందుల నుండి తెప్పించాం. నాకు హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి ద్వారా కొలంబో వాళ్లతో పరిచయం ఏర్పడింది. ఎనిమిది లక్షలు పెట్టి ఆవిగ్రహాన్ని తీసుకెళ్లారు. దాన్ని తయారు చేయడానికి ఐదు నెలలు పట్టింది. మైసూరులో 18 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహాన్ని తయారు చేశాను. పలువురితో ప్రసంశలందుకున్నాను. ఒక కుమారుడు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వారిని మాత్రం ఈ వృత్తిలోకి దింపలేదు. చదువుకుంటున్నారు.

- సుబ్రమణ్యాచారి

ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఈప్రాంతానికి వచ్చారు. ఆయన స్వయంగా కళాకారుడు కావడంతో శిల్పకళను నేర్పేందుకు ఒక పాఠశాలను ఏర్పాటు చేశారు. బాలవీరాచారి నేతృత్వంలో కొంతకాలం నిర్వహించి సరైన ప్రోత్సాహం లేక మూసేశారు. శిల్పకళను మూడు నుండి నాలుగు సంవత్సరాల పాటు నిర్ణీతసమయం నిర్ణయించి నేర్పితే పూర్తిగా నేర్చుకునే అవకాశం ఉంది.

రాళ్ల ఎంపిక ఇలా...

శిల్పానికి అవసరమైన రాళ్లను వచ్చే అర్డర్లను బట్టి ఎంపిక చేసుకుంటారు. మైసూరు నుండి వచ్చే రాళ్లను విగ్రహాలు, నగిషీలు, ఆభరణాలు చెక్కడానికి బాగా ఉపయోగిస్తారు. కడపజిల్లా జమ్ములమడుగు ప్రాంతంలో లభించే రాళ్లు గట్టిగా ఉంటాయి. సిమెంటు విగ్రహాలు రాతివిగ్రహాలు తయారు చేసే పద్ధతి వేరువేరుగా ఉంటుంది. సిమెంటు విగ్రహాలు తయారు చేసేప్పుడు సన్నగా ఉన్న సీకులు సిమెంటును క్రమంగా ఎంతమందం కావాలో అంత మేర అతికించుకుంటూ వస్తారు. రాతి విగ్రహానికి లావుగా ఉన్న రాతిని కావల్సిన స్థాయికి మలుచుకుంటూ రావాలి. రాళ్లను మలిచే సమయంలో విరిగినా ఆకారం పోయినా ఆరాయి నిరుపయోగమవుతుంది. అందుకే ఏ విగ్రహాన్ని తయారు చేయాలనుకున్నామో ఆ స్థాయి రాతిని ఎంచుకుంటారు.

వారూ వీరూ అని లేదు
అంతా నేర్చుకున్నారు

పూర్వం శిల్పకళను విశ్వబ్రాహ్మణులు తమ కుల వృత్తిగా స్వీకరించేవారు. ప్రస్తుతం అన్ని కులాల వారు ఈవృత్తిలోకి వచ్చారు. కానీ బాగా స్థిరపడి ఈ వృత్తి నుండి ఫలితం పొందిన వారు, పొందుతున్న వారు ఎక్కువగా విశ్వబ్రాహ్మణులే. పూర్వం ఈకళను నేర్చుకోవడానికి వీరు మాత్రమే శ్రద్ధ చూపేవారు. బాలవీరాచారి అనే శిల్పి వీరబ్రహ్మంగారిని అనుకరించి అన్ని కులాలకు ప్రాధాన్యత ఇచ్చి నేర్పారు. ఈవృత్తిలో స్థిరపడ్డ వాళ్లు మాత్రం తక్కువే. దూదేకులు, బలిజ, మాదిగ, బోయ, రెడ్డి కులస్తులు ఈ వృత్తి నేర్చుకున్న వారున్నారు. హిందువులే కాకుండా క్రిస్టియన్, ముస్లిములు కూడా నేర్చుకున్నారు.

బాల్యం నుంచే శిక్షణచి

మొక్కయి వంగనిదే మానయి వంగదన్న సామెత ఇక్కడ బాగా అతుకుతుంది. చిన్నతనం నుంచే శిల్పాలను చెక్కడంలో శిక్షణనిస్తారు. వీరికి ప్రత్యేక సిలబస్ అంటూ ఏం లేదు. 10 నుండి 11 ఏళ్ల వయస్సు వాళ్లకు ఎక్కువగా నేర్పుతారు. ఆ వయస్సులో అయితే వారు శిల్పకళ నేర్చుకోవడానికి బావుంటుంది.

చిన్నవయస్సే అనువుగా ఉంటుంది. ముందుగా డ్రాయింగుపైన కొంత అవగాహన కల్పిస్తారు. వివిధ రకాల బొమ్మలను పలకపై గీయడం అలవాటు చేస్తారు. కొలతలు, చదవడం, రాయడం నేర్పుతారు. ప్రాక్టీస్ కోసం చెడిపోయిన రాళ్లను తొలవడానికి ప్రయత్నిస్తారు. శిల్పకళను నేర్చుకునే వారికి మొత్తం మూడు సంవత్సరాలు పడుతుంది. మొదటి ఏడాది నేర్పేప్పుడు భోజనం మాత్రం పెడతారు. రెండో ఏడాది పనిని బట్టి సవంత్సరానికి కొంత నిర్ణయించి ఇస్తారు. మూడేళ్ల పాటు పని నేర్చుకున్నాక కనీసం ఏడాదిపాటు గురువు దగ్గరే



అదే వృత్తిలో ఆరుతరాలు

ఆరుతరాల నుండి మాకుటుంబం ఈవృత్తిపై ఆధారపడి ఉంది. నేను ఐదవ తరం వాడిని. ఆరోతరం వారైన మాకుమారులూ ఈ వృత్తినే ఎంచుకున్నారు. మైసూరు గణపతి సచ్చిదానందస్వామి ఆస్థానంలో పని చేశాం. విగ్రహాలను, ఆలయ నిర్మాణాలను చేస్తున్నాం. హైదరాబాద్ హోటల్ మేరియేట్ స్థంబాలను, రాతి ఏనుగులను, వైశ్రాయ్ హోటల్ ముందు రాతి ఏనుగులను తయారు చేశాం. దుండిగల్ అయ్యప్పస్వామి దేవాలయాన్ని రాతితో నిర్మించాం. ప్రస్తుతం 40 మంది మాదగ్గర పని చేస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే ఈ కళ మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. మా దగ్గర పని చేసుకున్న వారు పిట్స్‌బర్గ్‌లో (అమెరికా) వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించారు. వైష్ణవ, శైవదేవాలయాలతో పాటు దేశనాయకుల విగ్రహాలను చేస్తున్నాం. అదేవిధంగా ప్రస్తుతం హోటళ్లు, ఇంటీరియల్ గార్డెన్లలోకి కూడా రాళ్ల విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు. వచ్చిన పనుల్లో ఒక్కో పనిలో లాభం, ఒక్కో పనిలో నష్టం వచ్చే అవకాశాలున్నాయి. ఈకళలో ఇంకా చాలామందికి శిక్షణ ఇవ్వాలి. అందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తే బావుంటుంది.

- రామకృష్ణాచారి

పని చేయడానికి అగ్రిమెంటు చేసుకుంటారు.

భాగాలుగా విభజించి చెక్కుతారు

విగ్రహాలను చెక్కేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. గర్భగుడులు , ధ్వజస్థంభాలు , ఆలయాలు చెక్కేటప్పుడు జ్యోతిష్యంలో నిష్ణాతులయిన సిద్ధాంతితో జాతకం చూయించి ఎన్ని అడుగుల విగ్రహాలు తయారు చేయాలనేది రాయిస్తారు. దాని ప్రకారం విగ్రహాలను తయారు చేస్తారు. ఏదయినా విగ్రహాన్ని తయారు చేయాలంటే రాతిని తొమ్మిది భాగాలుగా విభజించుకోవాలి. తొమ్మిది అడుగుల విగ్రహం తయారు చేయాలంటే ముందుగా ముఖాన్ని తొమ్మిది అంగుళాల వెడల్పు ఉండేలా చేసుకుంటారు. ఎదను 18 అంగుళాలు ఉండేలా చూస్తారు. దానికి తగినట్లుగా మిగతాభాగాలను రూపొందించుకుంటారు. ఈ విధంగా శరీరాన్ని తొమ్మిది భాగాలుగా ఎంచుకోవడాన్ని 'నవతాళం' అంటారు. బలిష్టంగా ఉండే ఆంజనేయుని విగ్రహాన్ని తయారు చేసేప్పుడు అష్టతాళం అంటే ఎనిమిది భాగాలుగా విభజించి విగ్రహాన్ని తయారు చేస్తారు.

విగ్రహ పరీక్షలు

పూర్తి చేసిన విగ్రహాన్ని తీసుకెళ్లేపుడు తొలుత నీళ్లలో నానబెడతారు. విగ్రహం నానిన తరువాత రాతిలో చిన్నపాటి లోపాలు, మరేమైనా అతుకులు ఉంటే ఊడిపోతాయి. ఆతరువాత ధాన్యంలో ఉంచుతారు. ధాన్యంలో బాగా వేడెక్కుతుంది. అక్కడ కూడా శిలలో ఏమైనా లోపాలుంటే పెచ్చులుగా ఊడిపోతుంది. ఈవిధంగా పరీక్షలు పూర్తయ్యాక తీసుకెళతారు. ఇలాంటి పరీక్షల్లో విగ్రహం పాడయిపోతే , లేదా పెచ్చులుగా ఊడినా తిరిగి కొత్త విగ్రహాన్ని తయారు చేయించుకుంటారు. దేవతా విగ్రహాలను తయారు చేసే ముందు సరయిన శిల్పాన్ని ఎంచుకోకపోయినా సక్రమంగా తొలచక పోయినా ఫలితం ఉండదు. శ్రమంతా వృధా అవుతుంది. కాబట్టి చాలా జాగ్రత్తలు తీసుకుంటారు.

ఆయుధాలివే...

శిల్పాలు నున్నగా రావడానికి ప్రస్తుతం చిన్నగ్రైండర్ యంత్రాన్ని వాడుతున్నారు. 2003లో ఆదరణ పథకం కింద ఈ పరికరాన్ని





నాన్న పేరు నిలబెట్టాలి



బాలవీరాచారి కుమారునిగా ఆయన పేరును నిలిపేందుకు నేను ఈ వృత్తిని ఎంచుకున్నాను. చిన్ననాటినుండే చదువుకంటే ఈకళను నేర్చుకోవడం మీదే ప్రత్యేక శ్రద్ధ చూపాను. శిరివెళ్ల మండలం గుంపరమాన్‌దిన్నె గ్రామానికి చెందిన మాకుటుంబం 1950లో ఆళ్లగడ్డకు వచ్చింది. మాతండ్రి శ్రీశైలం భ్రమరాంబదేవి మండపాన్ని మూడేళ్ల పాటు అక్కడే ఉండి నిర్మించారు. మహానందిలో రామాలయంలో అద్దాల మండపాన్ని తయారు చేశాం. ఎస్.వి.సుబ్బారెడ్డి మాతండ్రిని ఎన్.టి.రామారావుకు 1985లో పరిచయం చేశారు. వెంకటేశ్వరస్వామి, పద్మావతి, ఆండాళమ్మ విగ్రహాలను ఆయన నాచారం స్టూడియోలో పెట్టుకున్నారు. ఆ కాలంలో మాకు 25000 రూపాయలు ఇచ్చారు. 1986లో శిల్పకళను నేర్పేందుకు పాఠశాలను ఏర్పాటు చేశారు. ఏడాది కాలంలో శిక్షణా కాలం సరిపోదని మూసేశారు. కనీసం మూడు సంవత్సరాలు ఉంటే ఈకళను పూర్తిస్థాయిలో నేర్చుకోవచ్చు. పూర్వం ఈకళ ఇక్కడ మాకుటుంబంతోనే ప్రారంభమైంది. ఈతరువాత 50 మంది నేర్చుకున్నారు. ఆర్థిక ఇబ్బందులకు తట్టుకోలేక 20 కుటుంబాలు ఈవృత్తిని వదిలారు. ప్రస్తుతం ఆళ్లగడ్డలో 30 కుటుంబాలున్నాయి. బనగానపల్లె మండలం నందవరం దగ్గర విఠలాపురం రాముడు, ఆంజనేయ విగ్రహాలను తయారు చేశాం. కొలిమిగుండ్లలో శివాలయాన్ని రాతితో నిర్మించారు. ప్రస్తుతం 25 మందికి ఉపాధి కల్పిస్తున్నాను. 1975లో హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో మాతండ్రి బాలవీరాచారికి అవార్డు వచ్చింది. మాసోదరుడు హరిప్రసాద్ కు జాతీయస్థాయి అవార్డు వచ్చింది. నా కుమారుడు శేఖరాచారి 8వ తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం టీకప్పు-సాసర్, నామాలను రాతితో తయారు చేశాడు. ఇప్పటికైతే ఆదాయం పరవాలేదు. విగ్రహం సైజును బట్టి రేటు తీసుకుంటాం. రోడ్డుమీద ఉన్నందున హైదరాబాద్ తదితర నగరాలనుండి వచ్చి విగ్రహాలను చేయించుకుంటున్నారు.

- రవీంద్రాచారి

ప్రభుత్వం కొందరికి ఇప్పించింది. అయితే పూర్వం ఇది లేదు. ఉలితోనే తొలిచే వారు. ఆకురాయి లాంటి పరికరాలను ఉపయోగించేవాళ్లు. విగ్రహాలను తయారు చేసే పనిలో సుత్తె, ఉలి, మూలమట్టం, కైవారం పరికరాలను ఉపయోగిస్తారు. ఉలికి సానపెట్టడానికి కొలిమిని వాడతారు.

తల నుంచే ప్రారంభం

శిల్పులు సాధారణంగా అన్ని విగ్రహాలను తయారు చేస్తుంటారు. వారి నైపుణ్యాన్ని బట్టి వివిధ రకాల విగ్రహాలను చేస్తారు. సృజనాత్మకత అనేది వారు పెట్టే శ్రద్ధపై ఆధారపడి ఉంటుంది. ఎంతపెద్ద విగ్రహాన్నైనా ముందుగా తల భాగం నుండే ఆరంభిస్తారు. పెద్ద విగ్రహాలను తయారు చేయడానికి స్టాండు ఏర్పాటు చేసుకుని దాని ఆధారంగా నలువైపులా స్టాండును తిప్పుకుంటూ తయారు చేస్తారు.

ప్రోత్సాహం ఏదీ!

ఈ వృత్తి ఎంతో శ్రమతో కూడుకున్నది. ఖరీదైనది కూడా. శ్రమకోర్చి శిల్పాలు చెక్కిన తరువాత ఒక్కోసారి లాభం రావచ్చు, ఒక్కోసారి నష్టం కూడా రావచ్చు. ప్రభుత్వం నుండి సరయిన ప్రోత్సాహం లేక తమ పిల్లలను ఈవృత్తిలోకి దింపడానికి వెనుకాడుతున్నారు. ఈ కళ నేర్చుకునే వారు పది పన్నెండేళ్ల నుండే ప్రారంభించాలని నిపుణులు చెబుతున్నారు. కాని చిన్నారులకు వృత్తి నేర్పుతుంటే బాలకార్మికులను పనిలో పెట్టుకున్నారని అధికారులు దాడులు నిర్వహించి పనిలోనుండి తొలగిస్తున్నారు. పెద్దవాళ్లకు ఈకళ నేర్పడం సమస్యగా ఉంటుంది. ప్రధానంగా శిల్పకళను నేర్పడానికి స్కూలును ఏర్పాటు చేయాలి. ఓర్పు, నేర్పు చాలా అవసరం. పూర్వం రాజులు ఈకళను పోషించేవారు. వీరు శిల్పులను తమ ఆస్థానంలో ఉంచుకుని కావాల్సిన సౌకర్యాలన్నీ కల్పించేవారు. వారి పిల్లల పెంపకానికి, విద్య నేర్పడానికి, పెళ్లిళ్లకు తగిన సాయమందేది. ప్రస్తుతం అలాంటిది లేదు. నష్టాలు వచ్చినప్పుడు ఈ వృత్తిని పూర్తిగా వదిలి వెళ్లినవారున్నారు.

ఆరోగ్య సమస్యలూ వున్నాయ్!

రాతి విగ్రహాలను తొలిచేప్పుడు వచ్చే దుమ్ము వల్ల ఆస్తమా, టీబీ వంటి శ్వాసకోశ వ్యాధులు వస్తుంటాయి. ఎక్కువగా కూర్చుని చేసే పనులుంటాయి. కాళ్లనొప్పులు వస్తుంటాయి. దుమ్ము, ధూళి నుండి తట్టుకోవడానికి ముక్కుకు, మూతికి గుడ్డ కట్టుకోవాలని డాక్టర్లు సూచిస్తారు. కాని అలా కట్టుకుంటే ఏదో అడ్డం ఉన్నట్లుగా ఉంటుంది. ఆ కారణంగా దృష్టి విగ్రహం మొత్తం మీద ఉండదు. కాబట్టి అలా కట్టుకోవడం సాధ్యం కాదు.

ఆరోగ్య పరమైన, ఆర్థిక పరమైన సమస్యలు వున్నా...పోషించే రాజులు, రాజ్యాలు లేకపోయినా... తరతరాలుగా వస్తున్న ఈ వృత్తిలోనే బతుకుతూ శిల్పకళను బతికిస్తూ...ప్రపంచ ఖ్యాతి తెచ్చిపెడుతున్న ఆళ్లగడ్డ శిల్పులు ఎంతైనా అభినందనీయులు.

కథ

జానకి చావు

ఊళ్ళ విశ్వనాథస్వామి

ఆమె లేని సమయంలో వాసు రోజూ పట్నం వెళ్ళడం ప్రారంభించాడు. అప్పుడే భూముల రేట్లు పెరిగాయి. చేతిలో డబ్బు ఉండటంతో వాసు ఒక మోపెడ్ కొన్నాడు. మోపెడ్ మీద దగ్గరలో ఉన్న టౌనుకెళ్ళేవాడు. సాయంకాలం అంతా అక్కడ గడిపేవాడు. వీలుచేసుకొని బారుకు వెళ్ళేవాడు.

నెలలు నిండిన తర్వాత జానకి ఆడపిల్లను కంది. మరో ఐదునెలల తర్వాత పిల్లను తీసుకొని ఇంటికి వచ్చింది. నామకరణం రోజున కుమారిని ఇంటికి పిల్చింది.

"జానకి చచ్చిపోయింది" అన్న వార్త కుమారి చెవిన పడిన వెంటనే చెమటలు పట్టేసి ... వణుకు వచ్చేసింది. నిన్న మొన్నటి దాకా నిక్షేపంగా వున్న జానకి చనిపోవడమేంటి? విన్నదంతా అబద్ధం కాదుకదా అనిపించినా.... ఒక మనిషి చావుబతుకుల గురించి అబద్ధమెలా చెప్తారనుకుంది. ఆ వెంటనే ఆమె కుప్ప కూలిపోయింది.

జానకి ఆమెకు చెల్లెలు అవుతుంది. చిన్నాన్న కూతురు. ఇద్దరిదీ ఒకే ఊరు. ఒకే వీధిలో ఇరుగు పొరుగుగా ఉండేవారు. జానకి ఆరవక్లాసుకు వచ్చేసరికి తను ఎనిమిది చదివేది. ఇద్దరూ కలసి హైస్కూల్‌కు వెళ్ళేవారు.

మనిషి సన్నగా పొడవుగా ఉండేది. చామనఛాయ. గుండ్రని ముఖం. 'అక్కా, అక్కా!' అని కుమారి వెంట తిరిగేది. ప్రతి విషయంలోనూ కుమారిని అనుకరించేది. ఆమెలా వుండడానికి ప్రయత్నించేది.

హైస్కూల్ ఇంటికి దూరంగా ఉండేది. దాంతో ఇద్దరూ కలిసే స్కూల్‌కు వెళ్ళేవారు. కలిసి వచ్చేవారు.

పదవతరగతి ఫస్టు క్లాసులో పాసయ్యింది. ఇంటర్మీడియట్ చదవాలంటే పక్క ఊరు పాలకొండ వెళ్ళాలి. అందుకే అంతటితో చదువు మానేసింది. కుట్లు, అల్లికలు నేర్చుకుంది.

ఆమె తండ్రి పేరు కృష్ణమూర్తి. అతనికి నాలుగు ఎకరాల మెట్ట భూమి ఉంది. అందరికంటే జానకి పెద్దది. ఆమె తర్వాత ఇద్దరు తమ్ముళ్ళు, వాళ్ళు ఇంకా చదువుకుంటున్నారు. ఒక్కగానొక్క కూతురుకు మంచి సంబంధం చూసి పెళ్ళిచేయాలనుకున్నాడు.

ఒకరోజు అతను శ్రీకాకుళం వెళ్ళాడు. అక్కడ కలెక్టరాఫీసులో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ దొరికాడు. అతను ఒకరోజు జానకిని చూడటానికి వచ్చాడు. అప్పటికి జానకి వయస్సు పద్దెనిమిది.

ఆమె ఎప్పుడూ రేడియోతో కాలక్షేపం చేసేది. అప్పట్లో టీవీలు లేవు. రేడియో పట్టుకుని పెరట్లో జామ చెట్టు కింద కూర్చొని ఉండేది.

కలెక్టరాఫీసులో పనిచేస్తున్న అతను లక్షరూపాయలు కట్నంగా అడిగాడు. ఉన్న నాలుగు ఎకరాల భూమి అమ్మినా లక్షరూపాయలు రావు. అందుకే అతనికి ఇవ్వలేకపోయాడు.

కుమారికి అప్పటికే పెళ్ళి అయింది. ఆమె అత్తవారిల్లు పాలకొండ. కుమారి కూడా జానకికోసం రెండు, మూడు సంబంధాలు చూసింది.

చూస్తుండగానే జానకికి ఇరవైరెండు సంవత్సరాలు నిండాయి. అందుకే కృష్ణమూర్తి వీరఘట్టం దగ్గర ఒక పల్లెటూరి సంబంధం నిశ్చయించాడు.

వాళ్ళకు ఐదెకరాల భూమి ఉంది. ఒక్కగానొక్క కొడుకు. అతను పెద్దగా చదువుకోలేదు. కానీ వాళ్ళకు పెద్ద మేడ ఉంది. అందుకే అతనితో పెళ్లికి జానకి అంగీకరించింది.

కుమారి కూడా ఆ వివాహానికి వచ్చింది. రెండెకరాల భూమి అమ్మి కృష్ణమూర్తి ఘనంగా పెళ్ళి చేశాడు. పెళ్ళి కుమారుని పేరు వాసు. ఆఊరిపేరు రాయవలస.

అలా సంవత్సరం గడిచింది. జానకి గర్భందాల్చింది. పురుడు కోసం పుట్టింటికి వచ్చింది.

ఆమె లేని సమయంలో వాసు రోజూ పట్నం వెళ్ళడం ప్రారంభించాడు. అప్పుడే భూముల రేట్లు పెరిగాయి. చేతిలో డబ్బు ఉండటంతో వాసు ఒక మోపెడ్ కొన్నాడు. ఆ మోపెడ్ మీద దగ్గరలో ఉన్న టౌనుకెళ్ళేవాడు. సాయంకాలం అంతా అక్కడ గడిపేవాడు. వీలుచేసుకొని బారుకు వెళ్ళేవాడు.

నెలలు నిండిన తర్వాత జానకి ఆడపిల్లను కంది. మరో ఐదునెలల తర్వాత పిల్లను తీసుకొని ఇంటికి వచ్చింది. నామకరణం రోజున కుమారిని ఇంటికి పిల్చింది.

రోజులు గడుస్తున్నాయి. పాప పెద్దది అవుతోంది. పంటలు బాగా పండటంతో వాసు చేతిలో డబ్బుండేది. ఆ డబ్బుతో రోజూ టౌనుకు వెళ్ళేవాడు. బారులో బ్రాందీ, విస్కీ తాగి ఇంటికి వచ్చేవాడు. దాంతో ఇద్దరి మధ్యా గొడవలు ప్రారంభమయ్యాయి.

బ్రాందీ తాగి జానకిని కొట్టడం ప్రారంభించాడు. ఎందుకంటే అతనికి అప్పులు పెరిగాయి. సంపాదన కన్నా ఖర్చు పెరిగింది.

రోజుకు రెండు వందలు ఖర్చు పెట్టేవాడు. అలా జానకి మెడలోని బంగారం అంతా హారతి కర్పూరంలా హరించుకుపోయింది.

కానీ అతను తాగుడు మానలేదు. అతనిచేత తాగుడు మాన్పించాలని జానకి కుమారికి ఉత్తరం రాసింది. కుమారి ఆ ఉత్తరం పట్టుకొచ్చింది.

జానకి వాసు విషయం చెప్పింది. కుమారి కూడా అతనిని మార్చలేకపోయింది.

మరింతగా జానకిని కొట్టడం ప్రారంభించాడు. అలా మరో సంవత్సరం గడిచింది.

జానకి మరలా గర్భందాల్చింది. ఈసారి పురుడు వాళ్ళింట్లోనే చేశారు. ఇంట్లో వంటకు నీళ్ళు లేకపోతే యేరు దగ్గరికి పోయి నీరు తెమ్మని చెప్పేవాడు. అంతకు ముందు నీళ్ళు మోసే మనిషి ఉండేది. ఇప్పుడు ఆమెకు డబ్బులు ఇవ్వక పోవడంతో ఆమె పని మానేసింది. అందుకే జానకి ఇంటికి కావలసిన పదిబిందెల నీళ్ళు మోసుకు వచ్చేది.

ఈసారి కూడా ఆడపిల్ల పుట్టింది.

జానకి కళ్ళు చెమ్మగిల్లాయి. ఆమె కళ్ళ దగ్గర నల్లని చారలు వచ్చాయి. మనిషి సన్నగా టీబీ పేషెంట్‌లా తయారైంది. అయినా వాసు తాగుడు మానలేదు. కొట్టడమూ మానలేదు. తాగిన ప్రతిసారీ కొట్టేవాడు.

ఒకరోజు జానకి, కుమారికి ఉత్తరం రాసి ఎవరికీ తెలియకుండా పోస్ట్ బాక్సులో వేసింది.

ప్రియమైన అక్కకు నమస్కారములు.

నేను పడుతున్న బాధలు ఎవరూ సహించలేరు. ఇంటి పనంతా చేస్తూ కూడా తన్నులు తినవలసి వస్తోంది. మా నాన్న కట్నం ఇవ్వలేక ఈ పల్లెటూరు సంబంధం చేశాడు. ఈ దేశంలో ఆడదానిగా పుట్టడం ఒక శాపం. ఎందుకంటే మగవాడికి ఒక రూలు, ఆడవారికి ఒక రూలు. ఆడవారికి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలి. రోజూ తాగడానికి పట్నం పోతారు గానీ, నాకోసం ఏమీ తేరు. ఇద్దరి పిల్లలకూ బట్టలు తీయరు. నేను నాన్న పంపే డబ్బులతోనే అన్నీ కొంటున్నాను. నీవు ఒకసారి రావలెను.

ఇట్లు

మీ చెల్లి జానకి.

ఉత్తరం అందుకొన్న వెంటనే జానకి దగ్గరకు వచ్చింది కుమారి. అప్పుడు జానకి పరిస్థితి ఏమీ బాగాలేదు. మనిషి నీరసంగా ఉంది.

కుమారి జానకిని తీసుకుని పాలకొండ డాక్టర్ దగ్గరకు పోయింది.

డాక్టర్ రాసిన మందులువాడింది. ఇరుగుపొరుగు వాళ్ళకు చెప్పి కుమారి వచ్చేసింది. అంతే!

రెండు నెలలు జానకి బాగుంది.

ఆకలి బాగా వేయటం వల్ల బాగా తినేది.

కానీ ఇంటిపని ఎక్కువ అవడం వల్ల మామూలుగా తయారయింది.

ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత వాసు మోపెడ్ అమ్మేశాడు. అదీ అప్పుల బాధలు పడలేక.

ఒకరోజు జానకి భోజనానికి వచ్చిన అతన్ని నిలదీసింది. అయినా అతను జవాబు చెప్పలేదు. ఇంత జరిగినా ఆమె అత్తమామలు నోరు విప్పలేదు. వాళ్ళిద్దరూ ముసలివాళ్ళైపోయారు. ఏమైనా అంటే కొడుకు తంతాడని భయం. కొడుకును ఏమీ అనేవారు కాదు. వారికి ఆ ఊరులో ఉన్న ధాన్యం మిల్లులో వాటా కూడా అమ్మేశాడని తెలిసింది. కూర్చొని తింటే కొండలు కూడా తరిగిపోతాయి. వాసు ఇప్పుడు టౌనుకెళ్ళడం మానేశాడు. రాత్రి, పగలు ఊళ్లోనే ఉంటున్నాడు. అలాంటి సమయంలో జానకి చావుకబురు కుమారికి తెలిసింది.



అదీకాక ఆ ఊళ్లో ఉన్న చుట్టాలమ్మాయి దగ్గరకు వెళ్తున్నాడని తెలిసింది. తాగుడు ఒక్కటే అనుకుంటే మరొకటి తగిలింది.

ఒకరోజు జానకి భోజనానికి వచ్చిన అతన్ని నిలదీసింది. అయినా అతను జవాబు చెప్పలేదు.

ఇంత జరిగినా ఆమె అత్తమామలు నోరు విప్పలేదు. వాళ్ళిద్దరూ ముసలివాళ్ళైపోయారు.

ఏమైనా అంటే కొడుకు తంతాడని భయం. కొడుకును ఏమీ అనేవారు కాదు.

వారికి ఆ ఊరులో ఉన్న ధాన్యం మిల్లులో వాటా కూడా అమ్మేశాడని తెలిసింది. కూర్చొని తింటే కొండలు కూడా తరిగిపోతాయి.

వాసు ఇప్పుడు టౌనుకెళ్ళడం మానేశాడు. రాత్రి, పగలు ఊళ్లోనే ఉంటున్నాడు.

అలాంటి సమయంలో జానకి చావుకబురు కుమారికి తెలిసింది.

ఆ కబురు తెలుసుకుని ఆమె ఆదరాబాదరాగా బయలుదేరింది. జానకి ఇంటికి వచ్చేసరికే అంతా అయిపోయింది. ఉదయం పది గంటలకు కబురు తెలిసింది.

వెంటనే బస్సు పట్టుకుని రాయవలస వచ్చింది. అప్పటికి మధ్యాహ్నం రెండు అయ్యింది. జానకి ఇంటికి వచ్చేసరికి మూడు గంటలయింది. అప్పటికే అన్నీ పూర్తిచేశారు.

ఇంత తొందరగా శవదహనం ఎందుకు చేశారో అర్థం కాలేదు ఆమెకు.

కుమారి ఒక్కతే చాకలి వీధికి వెళ్ళింది. తను జానకి అక్కను అని, తను ఎలా చనిపోయిందో చెప్పమని రహస్యంగా అడిగింది.

ముందు సంకోచించినా తర్వాత ఆయింటి చాకలి అంతా చెప్పింది.

"ఆ వాసుబాబు మరో అమ్మాయిని ఉంచుకున్నాడు కదా! ఆ అమ్మాయి పెళ్ళి చేసుకోమని అందట. ఆమె కోరిక ప్రకారం జానకిని చంపితే గానీ జరగదు కదా!

"అందుకే కొట్టకూడని చోట్ల కొట్టి కొట్టి చంపాడు" అంది.

కుమారికి ఆమె చెప్పిన విషయం అర్థమయ్యింది.

'అందుకే పోలీసులు రాకుండా వేగంగా దహనం చేసేశారు. జానకి పెళ్ళి జరిగి ఐదు సంవత్సరాలైంది. కాబట్టి అతనిపై పోలీసు కంప్లైంట్ ఇవ్వొచ్చు, కోర్టుకు వెళ్ళొచ్చు. అయినా ఏం లాభం? చనిపోయిన జానకి తిరిగిరాదుకదా! అందుకే అన్నారు "ఆడదానిగా పుట్టేకన్నా అడివిలో మానై పుట్టే మేలు". పైగా కోర్టులు కేసులు అంటూ తిరుగుతుంటే కుటుంబం పరువు పోతుంది. తర్వాత అధికార్లకు, లాయర్లకు డబ్బు ఇచ్చుకోవాలి. అన్నీ ఎక్కడి నుంచి వస్తాయి?' అనుకుంది కుమారి.

కానీ అంతలోనే జానకి అనుభవించిన కష్టాలు, పడిన బాధ, వేదన, హింస, ఏడుపు అంతా కళ్లకు కట్టినట్టు ఒక్కసారి గుర్తొచ్చింది. దాంతో జానకి భర్తమీద కోపం ఒక్కసారిగా పెరిగిపోయింది. రెండవ పెళ్లి చేసుకోవడానికి అడ్డుగా నిలిచిందని భార్యను చంపేయడం గుర్తొచ్చి రగిలిపోయింది. అతగాడికి బుద్ధి చెప్పాల్సిందేననుకుంది. అప్పుడుగాని ఇంకెవరూ ఇలా చేయరన్న మొండి పట్టుదల ఆమెలో పెరిగిపోయింది.

అందుకు ఏదోఒకటి చేయాలనుకుంది. అలాగైనా చనిపోయిన జానకికి న్యాయం చేసినట్టవుతుందనుకుంది.

✻

ఆలూ పరోటా

రాము: వెయిటర్! ఆలూ పరోటా అన్నావ్ దీనిలో ఆలూ లేదేం!

వెయిటర్: బాబూ హైదరాబాద్ బిర్యానీ అంటాం దాన్లో హైదరాబాద్ ఉంటుందా? ఇదీ అంతే !!

డా॥ జె.పి. వైద్య

అల్బా డాల్డా మాలాసిన్హా

గురుదత్ నిర్మించిన సదాబహార్ క్లాసికల్ ఫిల్మ్ 'ప్యాసా'లో మాలాసిన్హా పాత్ర మరచిపోలేనిది. రెహమాన్ ఎంతో శక్తి సామర్థ్యాలున్న 'భారీ భర్కమ్' నటుడు. ఆయన 'వక్త్'లోని విలన్ పాత్ర.... సాహెబ్ బీబీ అవుర్ గులామ్'లోని జమీందార్ పాత్ర నేటికీ 'ల్యాండ్ మార్క్ పాత్రలు! 'ప్యాసా'లో రెహమాన్ భార్యగా తట్టుకోవడం, అంతే ధీటుగా నిలబడడం 'మాలాసిన్హా'కే చెల్లింది. చప్పన కళ్ళలో నీళ్ళు నింపుకునే అందాల గృహిణి పాత్రలో ఎంతో అద్భుతంగా నటించ గల్గిందో అంతే చలాకీగా హీరోను తిప్పలు పెట్టే 'రమణి'గానూ తన ప్రత్యేకతను చాటి చెప్పింది మాలాసిన్హా.

జీవితం మనోహరమైన పుష్పం అయితే, ప్రేమ అందులో నిరంతరం స్రవించే మధురమైన మకరందం లాంటిది. 'చిక్ ... చిక్'... 'చుక్... చుక్' అంటూ రంగు రంగుల సీతాకోకచిలుకలూ, పక్షులూ పూలల్లోంచి మకరందాన్ని గ్రోలి మత్తుగా ఎగిరిపోతాయి.

మనలాంటి 'ఫిల్మీ దీవానా గాళ్ళ' మకరందం? అలనాటి పాత శ్యామ శ్వేత సినిమాలు....! అవిస్మరణీయమైన మధుర గీతాలు....! అలనాటి వెండి తెర నేలిన అప్సరసలు...! అంతే పసందైన ధైర్య సాహసాలు నిండిన రాజకుమారులూ... హీరోలూ...! వారిని తెరమీద 'న భూతో న భవిష్యత్'లా రూపొందించిన ప్రతిభా సంపన్నులైన మహనీయులు...!

అందుకే మనం ఆ 'చిత్రపు దునియా' దెబ్బకు తట్టుకోలేక జీవితమంతా దాసోహం అయిపోయిన 'దీవానాగాళ్ళం' గా తయారైపోయాము.

పొద్దున్నే లేచినప్పట్నుంచి - ఏ అర్థరాత్రో పడుకునే దాకా... అంతెందుకూ? నిద్రలోనూ కలవరిస్తూ ఆ పాత జమానానే తలచుకుంటూ గున్ గునాయించడం మనకు అలవాటయి పోయింది. 'జీవితంలో అవిభాజ్యమైన భాగం' అయిపోయింది.

'అరే...! మల్ల తయారై పోయిన్రు పిసోళ్ళు...! పాత జమానా సేన్మల లొల్లి షురు చేస్తున్రు మల్ల....! ఉర్కుని....!' అని పక్కవాళ్ళు చీత్కారం చేసినా, చీదరించుకున్నా, గేలి చేసినా తొలకరి చినుకులకు చిత్తయి పోయి, చిరునవ్వు చిందించే తొలి మొగ్గల్లా చిరంజీవులమై పోయాం....!

మన పిచ్చి ననది! మన దునిమా మనది!

ఎవరెన్ని రకాలుగా గోల చేసినా- బూజుకర్రతో దులుపుకొని మన 'దునియా'ను కాపాడుకుంటున్న 'వీరాభిమానులం'.

పాత జమానాలో ఒక బెంగాలీ- క్రిష్టియన్ జంటకు అందాల రాకుమారి జన్మించింది. వాళ్ళు ముద్దుగా 'అల్డా' అని పిలుచుకున్నారరు. అలనాటి పెద్దోళ్ళు ఇంకా ముద్దుగా 'డాల్డా' అని పిలిచారు. 'డాల్డా' ఆ రోజుల్లోని ఫేవరెట్ నెయ్యి బ్రాండ్. తల్లిదండ్రులు దంగై పోయి చటుక్కున పాప పేరు మార్చిపారేసారు. అలా 'అల్బర్ట్ సిన్హా' అని పేరు ప్రచురితమైంది. ఆ పాప నటన అంటే పడి చచ్చేది. స్కూల్లో ఏదో నాటకంలో ఆమెను చూశాడు ఎ.బోస్ గారు. ఆ రోజుల్లో ఆయన ఎంతో పేరున్న బెంగాలి సినీ దర్శకుడు! 'రోషనారా' అనే సినిమా నిర్మాణంలో తలమునకలై ఉన్నాడు. తల్లిదండ్రుల నుంచి అనుమతి తీసుకొని తన సినిమాలో తొలి చాన్స్ ఇచ్చాడు. కొన్ని అరకొర సినిమాలు అప్పనంగా, వడ్డించిన విస్తరిలా అందాయి.

కొన్నాళ్ళు కులాసాగా గడచి పోయాయి. 'కలకత్తా' తరువాత మజలీ హిందీ సినీ దునియా 'అడ్డా' ముంబాయి. ఏదో బెంగాలీ సినిమాలో షూటింగ్ కోసం ముంబాయి వెళ్ళిన 'సిన్హా'కు సుప్రసిద్ధ హిందీ సినీ గాయని గీతాదత్‌తో పరిచయం పెరిగి 'దోస్తీ'గా స్థిరపడింది. ఆమె భర్త 'ప్యాసా'- 'సాహెబ్ బీబీ ఔర్ గులామ్'- 'కాగజ్ కే ఫూల్' లాంటి సినిమా దిగ్గజుడు. 'గురుదత్' వాళ్ళు కేదార్‌శర్మకు 'సిన్హా' గురించి చెప్పారు. కేదార్ శర్మ చిన్నమనిషి కాదు. అదే పనిగా షూటింగ్ సమయంలో అమ్మాయిల కేసిచూస్తూ, అస్తమానం దువ్వెనతో స్టైలిష్‌గా తల దువ్వుకునే 'రాజ్ కపూర్' చెంప ఛెళ్ళు మనిపించిన తిక్క డైరెక్టర్ నీలికళ్ళ అందగాడు. 'ది గ్రేటెస్ట్ షోమ్యాన్ ఆఫ్ ఇండియన్ సినిమా'లా వ్యాపించి దాదా సాహెబ్ పురస్కారం పొందిన రాజ్‌కపూర్ పబ్లిగ్గా 'కేదార్ శర్మ' గొప్పతనాన్ని ఆత్మీయంగా ఒప్పుకున్న మనిషి. ఆ కేదార్ శర్మ 'సిన్హా'ను తన సినిమా 'రంగీన్ రాతేఁ' లో తీసుకున్నాడు.

తర్వాతి రోజుల్లో హిందీ సినీ సామ్రాజ్యంలో ఒక మంచి హీరోయిన్‌గా సుస్థిర స్థానాన్ని పదిలం చేసుకున్న 'మాలాసిన్హా' ఒకప్పుడు 'హజారోఁ లాఖోఁ దిల్‌వాలోఁ కి ధడ్‌కన్' అని పేరు సంపాదించుకున్న అందాల రాసి. స్వయంగా చక్కటి గాయని కూడా. కాని, తన సినిమాల్లో ఎప్పుడూ గానం చేయలేదు.

'ఆప్ కి నజరోఁనే సమఝూ ప్యార్ కే కాబిల్ ముఝే' అన్‌పఢ్ (62), 'ఏ హరియాలీ ఔర్ ఏ రాస్తా' (టైటిల్ గీతం)

'చలో ఏక్ బార్ ఫిర్ సే అజ్‌నబీ బన్ జాయెఁ హమ్ దోనో' (గుమ్‌రాహ్/63)లో సునీల్ దత్‌తో సరాగాలు సాగించిన 'మాలాసిన్హా' ఎన్నో

సినిమాల్లో శక్తివంతమైన స్త్రీ పాత్రలను అంతే ధీమాగా, హుందాగా నిలబెట్టింది.

1957లో గురుదత్ నిర్మించిన సదాబహార్ క్లాసికల్ ఫిల్మ్ 'ప్యాసా'లో మాలాసిన్హా పాత్ర మరచిపోలేనిది. రెహమాన్ ఎంతో శక్తి సామర్థ్యాలున్న 'భారీ భర్కమ్' నటుడు. ఆయన 'వక్త్'లోని విలన్ పాత్ర.... సాహెబ్ బీబీ అవుర్ గులామ్'లోని జమీందార్ పాత్ర నేటికీ 'ల్యాండ్ మార్క్ పాత్రలు! 'ప్యాసా'లో రెహమాన్ భార్యగా తట్టుకోవడం, అంతే ధీటుగా నిలబడడం 'మాలాసిన్హా'కే చెల్లింది.

చప్పున కళ్ళలో నీళ్ళు నింపుకునే అందాల గృహిణి పాత్రలో ఎంతో అద్భుతంగా నటించ గల్గిందో అంతే చలాకీగా హీరోను తిప్పలు పెట్టే 'రమణి'గానూ తన ప్రత్యేకతను చాటి చెప్పింది మాలాసిన్హా.

మాలాసిన్హా బిస్వజిత్, సునీల్ దత్, ఉత్తమ్ కుమార్, మనోజ్ కుమార్, రాజేంద్రకుమార్, రాజ్‌కపూర్‌లతో నటించిన సినిమాలు నేటికీ సూపర్‌డూపర్ ఎవర్‌గ్రీన్ ఆణిముత్యాలే!

కొన్నింటిని తలచుకుందాం! వీలైతే చూసి 'ఆ జమానా' లోకి వెళ్ళిపోండి. హాయిగా ఉంటారు కాసేపైనా!

'బహార్ ఫిర్ భి ఆయేంగే' - 'దిల్ తెరా దీవానా'-'హరియాలీ ఔర్ రాస్తా'-'అన్‌పఢ్'-'ఆంఖేఁ'-'దో కలియాఁ'- 'హిమాలయ్‌కి గోద్‌మేఁ' 'మేరే హుజూర్'- 'గుమ్‌రాహ్ - 'ధూల్ కా ఫూల్'-'ఫిర్ సుబహ్ హోగీ'- 'ప్యాసా'....

హిందీలో రాజేంద్ర కుమార్‌తో రంగుల చిత్రం 'గీత్' కొన్ని చోట్ల 'హిట్' కొన్నిచోట 'సో...సో' మరి కొన్ని చోట్ల 'నో' లా సాగింది.

మాలాసిన్హా నటించిన బెంగాలీ సినిమాల్లో 'రోషనారా'- 'షోహోరేర్ ఇటికోతా' (ఉత్తమ్ కుమార్‌తో) 'అభయా ఓ శ్రీకాంతా'-(లోకో ఛూరీ' (కిషోర్ కుమార్‌తో) 'కవిత' ముఖ్యమైనవి.

ఆవిడ నేపాలీలో 'మైతిఘర్'లో నటించారు.

'దిల్ తెరా దీవానా హై సనమ్ కుఛ్ నా కరేంగే హమ్....

మోహబ్బత్ కే కసమ్' అంటూ హంగామా చేస్తూ వర్షపు ధారల్లో జలకాలాడిన గీతంలో 'మాలాసిన్హా' -'షమ్మీకపూర్' చేసిన 'లొల్లి' ఇంతింత కాదు. నేటికీ 'హిందీ సినీ దునియా'లోని తడి గీతాల్లో ఆ గీతం 'మార్వలస్'. ఒక ట్రెండ్ సెట్టర్‌గా భావిస్తారు.

'తుమ్హారీ నజర్ క్యోఁ ఖఫాcc హోగయీ'లో బిస్వజీత్ తో 'ఝుట్కాలు' రంగరిస్తూ సాగిన గీతం కూడా ఒక 'మస్తీ గీతం'....'మత్తు గీతం'!

'ఆంఖేఁ'లో ధర్మేంద్ర జేమ్స్‌బండ్ టైప్ పాత్ర, 'దేదో అల్లాకే నామ్ పే...! అని మారు వేషంలో మహమూద్ ఎంత నవ్వించినా- తన ప్రత్యేకతను చాటిచెప్పింది. 'మాలా సిన్హా'!

'ధూల్ కా ఫూల్'-'హరియాలీ ఔర్ రాస్తా'లో ఎంత గడుగ్గాయి, వైట్ అండ్ డిలైట్‌ఫుల్ పాత్రల్లో చలాకీగా ఎగిరినా- 'ప్యాసా' - 'గుమ్‌రాహ్' లాంటి పాత్రల్లో 'మాలా వజ్ ఎట్ హర్ బెస్ట్!

ఆవిడ ఆఖరు సినిమా బెంగాలీలోని 'కవిత'... కమల్‌హాసన్, రంజిత్ మల్లిక్‌తో కలిసి నటించారు.

ప్రస్తుతం కూతురు ప్రతిభతో ముంబాయిలో 'పోస్ట్ రిటైర్‌మెంట్ కులాసా కార్యక్రమాలు' బస్! అంతే సంగతులు... ఇట్లు. అని మన ఊరుకోం కదా?

-'అన్నా! జర్రంత పాత సీన్మల సీడీలు తీ ఖై సాబ్... ! గీ కొత్త సేన్మలు దిమాగ్ ఖరాబ్ చేస్తున్నాయి... పాత సిన్మలు చూసి సుకూన్‌గా ఉందాం... నడూ! అని గోల మొదలు పెడ్తామా లేదా?

❋

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.

ఫోన్ : 08732223622





వీరి వీరి గుమ్మడి పండు జవాబు

వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరు అమీర్‌ఖాన్.

కథా నిలయం శ్రీకాకుళం

హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031

సరిగ్గా చదవడం లేదు...

మా తమ్ముడికి 17 సంవత్సరాలు. 10వ తరగతి చదువుతున్నాడు. ఎఫ్ఎమ్ రేడియో వింటాడు. చదవరా అంటే ఏదో మొక్కుబడిగా బుక్స్ పట్టుకొని కూర్చుంటాడు. సరిగ్గా చదవడం లేదు. ఏం చేయాలి. పరిష్కారం చెప్పండి?

కృష్ణ, శంకరంపల్లి.

ఈ రోజుల్లో చదువు అనేది ప్రతి మనిషి జీవితంలో ముఖ్యమైనది. సమాజం అభివృద్ధి చెందుతున్నకొద్దీ చదువు ప్రాముఖ్యత పెరుగుతూనే ఉంది. మీ తమ్ముడికి శారీరక, మానసిక, స్కూలు సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఉంటే సరిగ్గా చదవలేరు. చదువుపై ఆసక్తి లేకపోవటం కూడా ఇందుకు కారణాలే. తమపై తమకు నమ్మకం లేకపోవటం. మీ తమ్ముడిలో ఉన్న సమస్య గురించి అడిగి తెలుసుకోండి. ముఖ్యంగా సెక్స్ ఆలోచనలు వున్నా కూడా చదువుపై శ్రద్ధ తగ్గుతుంది. ఇంటి వాతావరణం, ఇంకా చదవాలన్న ఒత్తిడి వున్నా పిల్లలు చదవరు. ఎఫ్.ఎం. రేడియో 24 గంటలు విన్నా చదువుపై ఆసక్తి తగ్గుతుంది. మీ తమ్ముడిని రోజుకి కొంత సేపు చదువుకోమని చెప్పండి. తరువాత రేడియో వినమని చెప్పండి. అలా కొన్ని రోజులపాటు చదివిస్తే చదువు మీద ఆసక్తి పెరుగుతుంది. నీవు బాగా చదవగలవు. మంచి మార్కులు వస్తాయి. ఏ పనైనా అందరికంటే బాగా చేస్తావు అని ప్రోత్సహించండి. ఏ ఒక్క సబ్జెక్టులో మంచి మార్కులు వచ్చినా అభినందించండి. మీరు, మీ తల్లిదండ్రుల ప్రోత్సాహం మీ తమ్ముడికి ఒక గొప్ప 'టానిక్'లా పనిచేస్తుంది. ప్రతి రోజూ పాఠాలు చదివించాలి. హోమ్‌వర్క్‌ని చూడడం మీ తమ్ముడి మానసిక పరిస్థితికి అనుగుణంగా నడుచుకోవడం వల్ల బాగా చదివే అవకాశం వుంది. ఫ్యామిలీ కౌన్సిలింగ్ "సైకో థెరపీ" ద్వారా మీ తమ్ముడిలో మార్పు తేవచ్చు.

తొందరగా మర్చిపోతున్నా...

నేను ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. కాలేజీ మొదలయినప్పటి నుండి చదువుతున్నాను. మధ్యలో రెండు మూడు నెలలు చదవడం మానేశాను. మళ్ళీ ఇప్పుడు తిరిగి చదవాలంటే అప్పుడు చదివినవి గుర్తుకు రావడం లేదు. చదివినవి, నేర్చుకున్నవి చాలా తొందరగా మరచి పోతున్నాను. నాకు జ్ఞాపకశక్తి వుండేలా ఏమైనా సలహా ఇవ్వండి.

ధనుంజయ్, మహబూబ్‌నగర్.

విద్యార్థులకు సచిన్ టెండూల్కర్ ఎన్ని సెంచరీలు చేశాడు, ధోనీ బ్యాటింగ్

స్పీడ్ ఎంత, చిరంజీవి నూరో చిత్రానికి సంగీత దర్శకుడెవరు? ఏ టీవీలో ఏ టైమ్‌కి ఏమొస్తుంది? వంటి విషయాల్లో మెమరీ బాగా వుంటుంది. కాని చదువుకు సంబంధించిన ప్రశ్న అడిగితే నోరు వెళ్లబెడతారు. దీనికి కారణం ఆసక్తి లేకపోవడమే తప్ప మరొకటి కాదు. మీరు ఏది ముఖ్యమైనదిగా భావిస్తారో దాన్నే మీ 'మెదడు'లో బలంగా ముద్ర వేసుకుంటారు. నేర్చుకునే ప్రతి అంశం 'ముఖ్యమైనదే' అని మీ మెదడు భావించేలా చెయ్యండి. అప్పడే మీరు నేర్చుకున్నది బాగా గుర్తుంచుకుంటారు. మీ మెదడుకు గల విశిష్టతను ఉపయోగించుకుని పలు విషయాల పట్ల అసోసియేషన్ (లింకు పద్ధతిని ఏర్పరుచుకుంటే మీ జ్ఞాపక శక్తి) పెరుగుతుంది.

అలా ఉండడం తప్పా...

మా అక్క భర్త చనిపోయారు. బావగారి జాబ్ అక్కకి ఇచ్చారు. అక్కకు ఇద్దరు పిల్లలు. బాగా చదువుకుంటున్నారు. అక్క అందరితో సరదాగా, చక్కగా మాట్లాడుతుంది. ఎన్ని బాధలున్నా సంతోషంగా కనిపిస్తుంది. అయితే మా ఆయన ఎప్పుడూ మా అక్క గురించి నెగిటివ్‌గా మాట్లాడతారు. నాకు బాధగా ఉంటుంది. అక్క అలా ఉండడం తప్పా.

వనిత, పాలకొల్లు.

సమాజంలో మనుషులు రకరకాల మనస్తత్వం కలవారుంటారు. మీ ఆయన అంటున్న మాటలను పట్టించుకోవలసిన అవసరం లేదు. మీ అక్క ఎంత బాధున్నా సంతోషంగా ఉండగలుగుతున్నారంటే చాలా ఆనందించ తగిన విషయం. ఎవరు అండగా లేకపోయినా తన పిల్లలను చక్కగా చదివించుకుంటున్నారు. మీరు తనను చూసి సంతోషంగా ఉండండి. మీ భర్త మీ అక్క గురించి ఏమన్నా సౌమ్యంగా తిరస్కరించండి. చక్కగా మాట్లాడే వారితో అందరికీ మాట్లాడాలనిపిస్తుంది. దానిని మీరు తప్పగా భావించొద్దు.



ఎస్. వెంకట్రావు

ఒలింపిక్సు - సైన్సు

ఈ నెలాఖరులో బీజింగ్‌లో ప్రారంభం కామున్న ఒలింపిక్ క్రీడలవైపు ప్రపంచమంతా ఎదురు చూస్తోంది. బీజింగ్ ఒలింపిక్స్‌కు సంబంధించి ఇటీవల చైనా నుండి ఒక ఆసక్తికరమైన వార్త వెలువడింది. చైనా శాస్త్రవేత్తలు ఒలింపిక్స్‌ను జయప్రదం చేయడం కోసం ఆహోరాత్రాలూ కష్టపడుతున్నారనీ, ఒలింపిక్ క్రీడోత్సవాలు ముగిసే వరకూ శాస్త్రవేత్తలు కంటిమీద కునుకు లేకుండా కష్టపడతారని ఒలింపిక్ క్రీడలకోసం నియమించబడిన సైన్స్ అండ్ టెక్నాలజీ కమిటీ అధ్యక్షుడు, బీజింగ్ ఉప-మేయర్ లిన్ వెన్‌యి చెప్పారు. చైనా సైన్సు-సాంకేతిక శాఖ మంత్రి సు గువాన్‌హువా మాట్లాడుతూ "బీజింగ్ ఒలింపిక్స్ చరిత్రలోనే అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోకూడిన క్రీడోత్సవాలుగా సమోదయ్యేందుకు కావలసిన పద్ధతిలో శాస్త్ర-సాంకేతిక పరిశోధనను అందించనున్నామని చెప్పారు.

క్రీడలకూ, సైన్సుకూ సంబంధం ఏమిటని కొందరికి అనిపించొచ్చు. సాంకేతిక పరిజ్ఞానం సరే! సైన్సుకు ఒలింపిక్స్‌కు సంబంధమేమిటని కొందరికి అనిపించడం కద్దు. కాని క్రీడల వెనుక విపరీతమైన శాస్త్ర-సాంకేతిక పరిశోధన దాగి ఉండడం ఆధునిక ఒలింపిక్స్‌లో ఒక ప్రధానమైన విషయం. ఒలింపిక్స్ సందర్భంగా స్టేడియంలు నిర్మించడం. ఒలింపిక్ గ్రామం, రోడ్లు, రవాణా వంటి విషయాలే కాదు, ఆధునిక విజ్ఞాన శాస్త్రంలోని దాదాపు అన్ని శాఖలూ ఒలింపిక్ వెనుక ఉన్నాయి. ఉదాహరణకు బీజింగ్ ఒలింపిక్స్‌నే తీసుకుంటే అక్కడి పరిస్థితులను బట్టి రవాణా, విద్యుత్, ఇంధన శాస్త్ర-సాంకేతిక నిపుణులే కాకుండా ఉపగ్రహ సాంకేతిక శాస్త్రవేత్తలూ, ఇసుక తుపానులను పసిగట్టే శాస్త్రవేత్తలూ, డోపింగ్ నిరోధక నిపుణులు, సమాచార సాంకేతిక శాస్త్రవేత్తలు, ఆహార నిపుణులు కొన్ని వేల మంది రంగంలో ఉండి పనిచేస్తున్నారు. బీజింగ్ ఒలింపిక్స్‌ను "పచ్చని, ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రజా క్రీడోత్సవాలు"గా మలచడమే తమ లక్ష్యమని బీజింగ్ మేయర్ లియు క్వి చెప్పారు.

ఒలింపిక్స్‌లో క్రీడాకారుని శరీర నిర్మాణం, ప్రతిభా పాటవాల పెంపు దగ్గరి నుండి, అతను వేసుకునే దుస్తులు, పాదరక్షలు, క్రీడాకారుల శిక్షణ కోసం ఉపయోగించే పరికరాలు, క్రీడాకారులు ఆడే ఆట స్థలాలు (టర్ఫ్‌) వగైరా అన్నిటి వెనుకా పెద్ద ఎత్తున శాస్త్ర పరిశోధన దాగి ఉంది. క్రీడాకారుల చెప్పులనే తీసుకుంటే దాని వెనుక ఎంతో శాస్త్ర పరిశోధన జరుగుతోంది. అనేక రకాలైన పాదరక్షలు వస్తున్నాయి. పరుగు పందెంలో సెకన్లో వందో వంతు కూడా పతకాన్ని, తద్వారా దేశానికి ప్రతిష్టను, లేక అప్రతిష్టను తెస్తుంది కనుక ప్రతి అంశాన్నీ అత్యంత జాగ్రత్తగా పరిశోధించి క్రీడాకారులకు సమకూర్చినప్పుడే ఆధునిక ఒలింపిక్స్‌లో విజయం సాధించడం సాధ్యమవుతుంది. మానవ శరీరానికి ఉన్న పరిమితులను పెంచడమే ఒలింపిక్ క్రీడల లక్ష్యం. లాటిన్‌లో సిటియస్, ఆల్టస్, పోర్టియస్ అన్నారు. అంటే మరింత వేగంగా, మరింత ఎత్తుగా, మరింత బలంగా అని. మానవ శరీర పరిమితులను సాంకేతికంగా అభివృద్ధి పరిచిన శిక్షణ, స్టేడియంలు, పరికరాలు, దుస్తులు, పాదరక్షలతో పెంచడం జరుగుతోంది. సరిగ్గా ఈ విషయంలోనే ప్రతి దేశానికీ ముఖ్యంగా పతకాలు అధికంగా సాధించే దేశాలకు శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం కూడా బాగా ఉపయోగపడుతోంది.

ఒలింపిక్ క్రీడల నిర్వహణలో నేడు శాస్త్రవేత్తలకు సవాలుగా నిలిచిన అంశాలు కూడా కొన్ని ఉన్నాయి. వాటిలో క్రీడాకారులు తమ క్రీడా సామర్థ్యాన్ని పెంచుకోడానికి వాడే ఉత్ప్రేరకాలు (డోపింగ్) అతి పెద్ద సవాలు. ఆధునిక ఒలింపిక్స్ ప్రారంభం నుండే క్రీడాకారులు తమ సామర్థ్యాన్ని పెంచుకోడానికి రకరకాల ఔషధాలు తీసుకోవడం ప్రారంభించారు. చివరికి ఇది వేలం వెర్రిగా మారింది. 1904 ఒలింపిక్స్‌లోనైతే మారథన్ పోటీలో పాల్గొన్న థామస్ హిక్స్ అనే క్రీడాకారునికి అతని కోచ్ పోటీలో ఉన్న సమయంలోనే స్ట్రిక్‌నైన్ మందూ, కొంత బ్రాందీ ఇచ్చాడు. తరువాతి కాలంలో అన్ని దేశాల క్రీడాకారులూ ఇటువంటి ఉత్ప్రేరకాలను వాడడం ఆరంభించారు. దాంతో ఇది క్రీడా రంగంలో అనైతిక విషయమే కాకుండా క్రీడాకారుల పాలిట పెద్ద ఆరోగ్య సమస్యగా మారిపోయింది. కొందరు క్రీడాకారుల కోచ్‌లైతే కండరాలనూ, రక్తాన్నీ ఉత్తేజంతో నింపే రకరకాల డ్రగ్స్‌ను వాడడం ప్రారంభించారు. దాంతో ప్రపంచ క్రీడారంగంలో డ్రగ్స్ నిషేధించాలన్న ఆలోచన వచ్చింది. ఈ లోగా 1960 రోమ్ ఒలింపిక్స్‌లో సైక్లింగ్ రేస్‌లో పాల్గొన్న డెన్మార్క్ క్రీడాకారుడు నడ్ ఎనెమార్క్ డోపింగ్ ప్రభావంతో సైకిల్ మీద నుండి కిందపడి ప్రాణాలు వదిలాడు. దాంతో 1968 ఒలింపిక్స్ నుండి డోపింగ్‌ను పూర్తిగా నిషేధించారు. వివిధ దేశాల క్రీడా సమాఖ్యలు కూడా డోపింగ్‌ను నిషేధించాయి.

అయినప్పటికీ క్రీడాకారులు డోపింగ్‌ను మానలేదు. నిషేధం విధించిన తొలి ఒలింపిక్స్‌లోనే స్వీడన్ పెంటాథ్లన్ క్రీడాకారుడు హాన్స్ గున్నర్ లిల్జెన్‌వాల్ డోపింగ్ టెస్టులో పట్టుపడ్డాడు. అప్పటి నుండి ఉత్ప్రేరకాల విషయంలో శాస్త్రవేత్తలకూ, క్రీడాకారులకూ (వారి వెనకున్న వారికీ) మధ్య పోటీ జరుగుతూనే ఉంది. శాస్త్రవేత్తలు ఉత్ప్రేరకాలను పట్టుకోడానికి కొత్తకొత్త పద్ధతులు కనుగొంటూ ఉంటే, వాటినుండి తప్పుకునే కొత్తకొత్త ఉత్ప్రేరకాలను క్రీడాకారులు వాడుతూనే ఉన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు ఒలింపిక్స్‌లో 73 మంది క్రీడాకారులు ఉత్ప్రేరకాలు వాడుతూ పట్టుపడ్డారు. అన్నిటికన్నా పెద్ద సంచలనం సృష్టించింది 1988 సియోల్ ఒలింపిక్స్‌లో కెనడా 100 మీ స్ప్రింటర్ బెన్ జాన్సన్ ఉదంతం. ప్రపంచంలోనే అత్యంత వేగంగా పరుగెత్తిన క్రీడాకారునిగా రికార్డు సృష్టించిన జాన్సన్ ప్రపంచ ప్రజల జేజేలు అందుకున్నాడు. కాని ఇంతలోనే ఆయన ఉత్ప్రేరకాలు వాడినట్లు తెలియడంతో ప్రపంచం దిగ్భ్రాంతికి గురయ్యింది. మన దేశానికి చెందిన మహిళా వెయిట్ లిఫ్టర్ కరణం మల్లేశ్వరి కూడా 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో డోపింగ్ ఆరోపణలకు గురై 63 కిలోల వెయిట్‌లిఫ్టింగ్ కేటగిరి నుండి చివరి నిమిషంలో తప్పుకున్న సంగతి మనకు తెలుసు.

క్రీడల్లో ఉత్ప్రేరకాలను నిషేధించిన అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసి) క్రీడాకారుల శరీరంలోని ఉత్ప్రేరకాలను పట్టుకోడానికి ఎన్నిరకాల ఆధునిక పరిశోధనలు చేస్తున్నా ఉత్ప్రేరకాలు వాడే క్రీడాకారుల కన్నా వారు ఒక అడుగు వెనుకనే నడుస్తున్నారని "నేచర్" అనే శాస్త్ర విజ్ఞాన మ్యాగజైన్ పేర్కొంది. ఉత్ప్రేరకాలు లేని ఒలింపిక్స్ జరగాలంటే దీనిపై శాస్త్ర పరిశోధనకు మరింత ఖర్చు చేయాలని అది సూచించింది.

బీజింగ్ ఒలింపిక్స్‌ను మాత్రం ఉత్ప్రేరకాలు లేని ఒలింపిక్స్‌గా మారుస్తామని చైనా అధికారులూ, అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం అధికారులు చెబుతున్నారు. దీనికిగాను వారు అత్యంత కఠినమైన డోపింగ్ వ్యతిరేక పరీక్షలు నిర్వహించబోతున్నారు. బీజింగ్‌లో మొత్తం క్రీడలు ముగిసే సరికి 4,500 డోపింగ్ పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. దీనికిగాను వందలాది మంది శాస్త్రవేత్తలను నియమించారు. అనేక పరిశోధనా శాలలు ఏర్పాటు చేశారు. జులై 27న ఒలింపిక్ గ్రామం ప్రారంభమైనప్పటినుండీ ఎప్పుడైనా ఏ క్రీడాకారుడైనా డోపింగ్ టెస్ట్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. చైనా ప్రభుత్వమైతే డోపింగ్‌లో పట్టుబడ్డ వారిని జీవిత కాలం క్రీడలనుండి బహిష్కరిస్తామని హెచ్చరించింది. మొత్తం మీద ఇప్పటివరకు శాస్త్రవేత్తలపై డోపింగ్ క్రీడాకారులే విజయం సాధిస్తూ వచ్చారు. ఈ ఒలింపిక్స్‌లో విజయం ఎవరిదో చూడాలి. ❋

చాక్లెట్ డ్రింక్

కావలసిన పదార్థాలు

చాక్లెట్స్- రెండున్నర కప్పులు, పాలు-అరకప్పు
పంచదార - ఒక కప్పు, ఉప్పు- కొంచెం
పాలమీగడ- అరకప్పు, నీళ్ళు- అరకప్పు

తయారు చేసేవిధానం

పాలు మరగకాచి అట్టే పెట్టుకోవాలి. నీళ్ళు ఒక పాత్రలో పోసి అందులో చాక్‌లెట్ ముక్కలు (తీగలేనివి అయితే మంచిది) వేసి స్టౌ మీద పెడితే కొంత సేపటిలో బాగా కరుగుతాయి. ఇప్పుడు పంచదార, ఉప్పు చేర్చి బాగా కలియబెట్టాలి. బాగా వుడికిన తర్వాత మీగడవెయ్యాలి. మిక్చరు తయారవుతుంది.

వేడి చేసిన పాలు కప్పులోకి తీసుకొని ఒక కప్పులోకి ఒక చెంచా మిక్చరు (పైన తయారు చేసింది) వేసి కలబెట్టి అతిథులకి ఇవ్వవచ్చు.
ఇది వేడిగా తీసుకోవలసిన పానీయం.



బఠానీ కూర



కావలసిన పదార్థాలు

బఠానీలు-1 కప్పు, ఉల్లిపాయ- 1, టొమేటో -1, పచ్చిమిర్చి-4, ఉప్పు- చాలినంత, జీలకర్ర- కొంచెం, అల్లం- కొంచెం, పసుపు- చిటికెడు, నూనె-1 ఉగ్గు గిన్నెడు, లవంగాలు-5

తయారు చేసే విధానం

బఠానీలు తాజా కాయల నుంచి వలిచినవయితే సరేసరి. లేక పచ్చగా వుండే ఎండు బఠానీలు తీసుకుని ఒక రాత్రి పూర్తిగా నాననివ్వాలి. ఉల్లిపాయ, టొమేటో, అల్లం, పచ్చిమిరపకాయలు ముక్కలుగా కోసుకొని వుంచుకోవాలి. కడాయిలో నూనె బాగా కాగనిచ్చి మినపప్పు, ఎండుమిరప ముక్కలు, ఆవాలు, జీలకర్ర వేయించాలి. ఈలోగా బఠానీల్లో పసుపు, టొమేటో ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, పప్పు, అల్లం అన్ని కలుపుకొని వుంచాలి. పోపు సామాను చిటపటలాడుతుండగా అందులో బఠానీలు వేసి మూత పెట్టాలి. కడాయిని అటూ ఇటూ కదపాలి. కొద్దిసేపటికి బాగా మగ్గుతాయి. సరిపడా నీళ్ళుపోసి గింజ మెత్తబడేవరకు వుడకనిచ్చి దింపెయ్యాలి. దింపేముందు లవంగాలపొడి వేస్తే ఘాటుగా వుంటుంది.

బనానా డ్రింకు

కావలసిన పదార్థాలు

అరటిపళ్ళు- 2, నిమ్మకాయలు-2,
పంచదార- అరకప్పు, నారింజ తొనలు-2, మీగడ- అరకప్పు,
నీళ్ళు-1 గ్లాసు, ఐస్ ముక్కలు- 2 కప్పులు

తయారు చేసే విధానం

ఒక పాత్రలో అరటిపండు తొక్క తీసి బాగా పిసకాలి. అందులో నిమ్మరసం పంచదార బాగా కలపాలి. ఐస్ ముక్కల్లో ఈ పాత్రని పెట్టి బాగా చల్లగా చెయ్యాలి. చల్లగా వున్నప్పుడే నారింజ తొనలు చిదిమి ముత్యాలు వెయ్యాలి. మీగడ, నీళ్లు కొంచెం ఐస్‌వేసి బాగా కలియబెట్టాలి. అంతే! బనానా డ్రింక్ రెడీ. గ్లాసుల్లో పోసుకొని తాగవచ్చు.



కొత్తిమీర పచ్చడి

కావలసిన పదార్థాలు

కొత్తిమీర - 4 కట్టలు,
కరివేపాకు-2 రెబ్బలు
మినపప్పు- ఒక టీ స్పూను,
జీలకర్ర- కొంచెం
ఉప్పు - చాలినంత, నూనె- 1 టీ స్పూను
ఎండుమిర్చి- 1 సరిపడా

తయారుచేసే విధానం

నూనె బాగా కాగనిచ్చి అందులో మినపప్పు, ఎండుమిర్చి, జీలకర్ర వేయించాలి. చిటపటలాడుతుండగా కొత్తిమీర, కరివేపాకు వేసి కొద్దిగా మగ్గనివ్వాలి. తర్వాత ఉప్పు చేర్చి వాటన్నిటినీ రోట్లో వేసి మెత్తగా రుబ్బాలి. కావలసిన వారు అల్లం కూడా వేసుకోవచ్చు.



పళ్లు కుట్టుకునే పుల్లలే...

ఇక్కడ కనిపించే కళాఖండాలన్నిటినీ పళ్లు కుట్టుకునే పుల్లలతో (టూత్‌పిక్స్) చేశారంటే నమ్ముతారా! లేదుకదా. కానీ అదే వాస్తవం. శాన్‌ఫ్రాన్సిస్కో వాసి స్టీవెన్ జె.బ్యాక్‌మేన్ వీటి సృష్టికర్త. ఇతనికి చిన్నప్పటినుంచే టూత్‌పిక్స్‌తో వస్తువులను చేసే అలవాటుంది. తను ఎలిమెంటరీ స్కూల్లో చదువుకునేటప్పుడే టీచర్ ఒక సైన్స్ ప్రాజెక్ట్ చేసుకురమ్మన్నారు. అంతే చిన్నారి స్టీవెన్ టూత్‌పిక్స్‌ను, కొన్ని గింజలను ఉపయోగించి డిఎన్ఎ కణాల ఆకారాన్ని తయారుచేసి తీసుకెళ్లి చూపించాడు. అదిరిపోవడం టీచర్ వంతైంది. అయితే చేతిలో ఒక పుల్లగుచ్చుకోవడంతో ఇంక వాటితో పనిచేయడం మానేశాడు. తర్వాత 1984లో మళ్లీ టూత్‌పిక్స్‌నే ఉపయోగించి కారును తయారుచేసి మాంచి గుర్తింపుపొందాడు గురువుగారు. అలా ఎన్నో రకాల కార్లను తయారుచేసినా గోల్డెన్ గేట్ బ్రిడ్జ్‌ని రూపొందించాలనిపించింది. అనుకున్నదే తడవుగా మొదలెట్టేశాడు. అది పూర్తవడానికి రెండేళ్లు పట్టింది. 13 అడుగుల ఎత్తుండే ఈ బ్రిడ్జ్ తయారీకి సరిగ్గా 30,000 టూత్‌పిక్స్‌ని ఉపయోగించాడు. ఈ దెబ్బతో ఒక్కసారిగా పాపులర్ అయిపోయాడు. అప్పటినుంచి ఇదిగో ఇలా కళాఖండాలు సృజిస్తూనే వున్నాడు.





కథా నిలయం శ్రీకాకుళం

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూ కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్ కలంస్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్.

పేరు: కలువకోట హారిక
చదువు: 6వ తరగతి
వయస్సు: 11 సం॥
స్కూలు: పురాతన ఉన్నత ప్రభుత్వ పాఠశాల
లక్ష్యం: కలెక్టర్ కావడం
హాబీలు: చదవడం, అన్ని భాషలు నేర్చుకోవడం, టీవీ చూడడం
చిరునామా: కె. హారిక, డాటరాఫ్: మురళీధర స్వామి, కృష్ణానగర్, జగిత్యాల, కరీంనగర్.

పేరు: తిరునగరి తరుణ్
చదువు: 6వ తరగతి
వయస్సు: 9సం॥
స్కూలు: ఇండో అమెరికన్ స్కూల్, బాలాపూర్
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, క్రికెట్ ఆడడం
చిరునామా: టి. తరుణ్, సన్నాఫ్: పవన్‌కుమార్, బాలాపూర్, మిధాని, హైదరాబాద్.

పేరు: కె. స్వామి అఖిలేష్
చదువు: 7వ తరగతి
వయస్సు: 12 సం॥
స్కూలు: పురాతన ఉన్నత ప్రభుత్వ పాఠశాల
లక్ష్యం: టీచర్ కావడం
హాబీలు: క్యారమ్స్, షటిల్ ఆడడం, టీవీ చూడడం
చిరునామా: స్వామి అఖిలేష్, సన్నాఫ్: మురళీధర స్వామి, కృష్ణానగర్, జగిత్యాల, కరీంనగర్.

పేరు: ఎల్. హనుమంతరావు
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జిల్లా పరిషత్ హై స్కూల్
లక్ష్యం: లెక్చరర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, సినిమాలు చూడడం
చిరునామా: ఎల్. హనుమంతరావు, సన్నాఫ్: వల్లెక్కం, గండ్రాయి, జగ్గయ్యపేట, కృష్ణాజిల్లా.

పేరు: సి.హెచ్. శ్రీనివాస్
చదువు: 6వ తరగతి
వయస్సు: 9 సం॥
స్కూలు: భాష్యం స్కూల్
లక్ష్యం: ఎస్సై కావడం
హాబీలు: చదవడం, టీవీ చూడడం, ఆటలు ఆడడం
చిరునామా: సి.హెచ్ శ్రీనివాస్, భవానీపురం, విజయవాడ.

పేరు: జె. పోతులూరి చారి
చదువు: 9వ తరగతి
వయస్సు: 14సం॥
స్కూలు: జిల్లా పరిషత్ హై స్కూల్, నూతన్‌కల్
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, ఆడడం, పాటలు పాడడం
చిరునామా: జె. పోతులూరి చారి, సన్నాఫ్: సత్యనారాయణ, నూతన్‌కల్, నల్గొండ.